

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా


RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1

సంపుటి : 14 సంచిక : 340 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 29-11-2025 పేజీలు : 12 వెల రూ.3/


## ఈ ప్రయాణం ఇక
# ఎవరూ ఆపలేరు

- సీఎం చంద్రబాబు అమరావతిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల భవనాలకు శంకుస్థాపన
- కేంద్ర సహకారంతో అమరావతి ఇక అన్‌స్టాపబుల్ అని సీఎం ధీమా
- 2028 నాటికి రాజధాని నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టం
- పోలవరం పూర్తి చేసి రాయలసీమకు సాగునీరు అందిస్తామని హామీ
- రూ.1.37 లక్షల కోట్ల పెట్టుబడితో విశాఖకు గూగుల్ రాక



**అమరావతి**

కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రగతి ఇక అన్‌స్టాపబుల్... ఈ ప్రయాణాన్ని ఇక ఎవరూ ఆపలేరు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధ్వంసంతో ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా పునఃప్రారంభించామని, 2028 నాటికి అద్భుతమైన నగరాన్ని నిర్మించి చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో శుక్రవారం 15 బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలను పరుగులు పెట్టించే లక్ష్యంతో రూ.1,334 కోట్ల వ్యయంతో 15 ప్రతిష్ఠాత్మక ఆర్థిక సంస్థలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేయడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, నాబార్డ్ వంటి దిగ్గజ సంస్థల రాకతో అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ శరవేగంగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. ఈ సంస్థల ద్వారా ప్రత్యక్షంగా 6,556 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ సంస్థలన్నీ తమ ప్రధాన కార్యాలయాలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో, అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో నిర్మించాలని

మిగతా 2లో



## పవన్ కల్యాణ్ రాజోలు పర్యటనలో అపరిచిత వ్యక్తి కదలికలు

- పవన్ కల్యాణ్ రాజోలు పర్యటనలో కలకలం
- ఆయన సమీపంలో అనుమానాస్పదంగా సంచరించిన వ్యక్తి
- సదరు వ్యక్తి వైసీపీ కార్యకర్తగా గుర్తింపు
- అతనిపై కోనసీమ ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీసీఎం కార్యాలయం
- సంఘటనపై పూర్తిస్థాయి విచారణకు డిమాండ్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజోలు పర్యటనలో భద్రతాపరమైన ఆందోళన కలిగించే సంఘటన చోటుచేసుకుంది. ఈ నెల 26న ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో, ఓ అపరిచిత వ్యక్తి ఆయనకు అత్యంత సమీపంలో అనుమానాస్పదంగా సంచరించడం కలకలం రేపింది.

2



2

## బిహార్ ఓటమికి నేనూ బాధ్యుడినే..

కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ



## 4న భారత్‌కు పుతిన్

రక్షణ, దౌత్యపరమైన బంధాలతోపాటు పలు ఇతర అంశాల్లో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం

2



గ్రామ పంచాయతీ ఎన్నికలు..

## రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారు

- డిసెంబర్ 1 నుంచి ఒక్కో జిల్లాలో ఒక్కోరోజు పర్యటించనున్న ముఖ్యమంత్రి
- డిసెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ముఖ్యమంత్రి పర్యటన
- మక్తల్, కొత్తగూడెం, హుస్నాబాద్, నర్సంపేట, దేవరకొండలలో పర్యటన

వివరాలు 2 లో..

## ఏపీలో స్క్రబ్ టైఫస్ కలకలం..

### 26 జిల్లాలకు విస్తరించిన జ్వరాలు!

- రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న స్క్రబ్ టైఫస్ కేసులు
- నల్లిలాంటి కీటకం కుట్టడం వల్ల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుందంటున్న వైద్యులు
- అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 379 కేసులు




**ఆంధ్రప్రదేశ్**

ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' జ్వరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ఈ కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం (ట్రాంబికులిడ్ మైట్) కుట్టడం ద్వారా 'ఓరియంటియా సుట్సుగముషి' అనే బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి ఈ వ్యాధికి కారణమవుతుంది. ఈ కీటకం కుట్టిన చోట నల్లని మచ్చ ఏర్పడి, దద్దుర్లు వస్తాయి. వారం, పది రోజుల తర్వాత జ్వరం, వణుకు, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణ సంబంధిత సమస్యల

మిగతా 2లో



2

## జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనంపై స్పందించిన బీజేపీ

- 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని మంత్రివర్గం నిర్ణయం
- మున్సిపాలిటీల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నామన్న బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

# ఈ ప్రయాణం ఇక ఎవరూ ఆపలేరు

మొదటిపేజీ తరువాయి

ఆయన కోరారు.రాజధాని నిర్మాణం కోసం 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా చంద్రబాబు శిరస్సు వంచి నమస్కరించారు. ప్రపంచంలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన ల్యాండ్ పూలింగ్ విధానంలో భూ సమీకరణ జరిగిన ఏకైక ప్రాంతం అమరావతి అని కొనియాడారు. రాజధాని పునర్నిర్మాణ పనుల కోసం కేంద్రం రూ.15 వేల కోట్లను కేటాయించిందని గుర్తుచేశారు. "దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గాడిలో పెట్టారు. వారి సహకారంతో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ నిలబెడుతున్నాం. ఇంకా ఇబ్బందులు ఉన్నా, అభివృద్ధి సాధించగలమన్న విశ్వాసం మాకుంది" అని అన్నారు.అమరావతికి కేవలం ఆర్థిక సంస్థలే కాకుండా ప్రపంచస్థాయి విద్యా, వైజ్ఞానిక సంస్థలు కూడా తరలివస్తున్నాయని చంద్రబాబు తెలిపారు. విట్, ఎస్ఆర్ఎం వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కోసం క్వాంటం వ్యాలీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఆధ్వర్యంలో కాస్మోస్ ప్లానెటోరియం కూడా ఏర్పాటు కానుండటం శుభపరిణామమన్నారు. త్వరలోనే సీడ్ యాక్సెస్ రహదారిని పూర్తి చేస్తామని, 7 జాతీయ రహదారులు, రైల్వే లైన్లతో అమరావతిని అనుసంధానిస్తామని చెప్పారు. అమరావతిని పూర్తిస్థాయి గ్రీన్, బ్లూ సిటీగా తీర్చిదిద్ది, భారతదేశం గర్వపడే రాజధానిగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధిపైనా ఆయన కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు పారిపోయాయని, అయితే కూటమి ప్రభుత్వంపై భరోసాతో ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయని, అందులో భాగంగానే గూగుల్ సంస్థ రూ.1.37 లక్షల కోట్ల పెట్టుబడితో విశాఖకు వస్తోందని వెల్లడించారు. మరోవైపు, గోదావరి, కృష్ణా నదుల నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు అనుసంధానించి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు పూర్వోదయ పథకం కింద ఉదారంగా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, కేంద్ర సహకారంతో ఏపీ త్వరలోనే నిలదొక్కుకుని దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనంపై స్పందించిన బీజేపీ

జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనంపై తెలంగాణ బీజేపీ స్పందించింది. నగర పరిధిలోని 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని రెండు రోజుల క్రితం తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. జీహెచ్ఎంసీని విస్తరించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ నిర్ణయంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందిస్తూ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో మున్సిపాలిటీల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ విలీనం అశాస్త్రీయంగా ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మిత్రపక్షం మజ్లిస్ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకు మున్సిపాలిటీలను విలీనం చేస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు.

## ఏపీలో స్క్రబ్ టైఫస్ కలకలం..

మొదటిపేజీ తరువాయి

రూపంలో ఇన్ఫెక్షన్ లక్షణాలు బయటపడతాయి. అయితే చాలామంది దీనిని సాధారణ జ్వరంగా భావించి నిర్లక్ష్యం చేస్తున్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోకపోతే, అది తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మెదడువాపు, మూత్రపిండాల వైఫల్యం వంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది.
రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 379 కేసులు నమోదు కాగా, కాకినాడ (141), విశాఖపట్నం (123) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దాదాపు అన్ని జిల్లాల్లోనూ కేసులు వెలుగుచూశాయి. సాధారణ యాంటీబయాటిక్స్‌తోనే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, అయితే అవగాహన లేకపోవడమే సమస్యకు కారణమని వైద్యులు చెబుతున్నారు. జ్వరం తగ్గకుండా ఉండి, శరీరంపై నల్లటి మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి 'ఎలీసా' పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో అనుమానిత కేసులు ఎక్కువగా నమోదవుతున్నా, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కేవలం విజయవాడ, గుంటూరు, విశాఖ వంటి ప్రధాన నగరాల్లోని ఆసుపత్రులకే పరిమితమయ్యాయి. దీంతో వ్యాధి వ్యాప్తిని సకాలంలో గుర్తించడం కష్టమవుతోంది. అన్ని ప్రాంతాల్లో పరీక్షా సౌకర్యాలు పెంచి, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తే వ్యాధిని త్వరగా నియంత్రించే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## పిఠాపురం మున్సిపాలిటీలో ఐదుగురు అధికారులపై వేటు

**గత ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు**
**విజిలెన్స్ విచారణలో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ**
**పనులు చేయకుండానే బిల్లులు చెల్లించారని ఆరోపణలు**




పిఠాపురం మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో అసిస్టెంట్ ఇంజనీర్లుగా పనిచేసిన పి. వంశీ అభిషేక్, కె. రత్నవల్లి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. భవానీ శంకర్, మున్సిపల్ టౌన్ ప్లానర్ ఎంటీ హుస్సేన్, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారావులపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.గత వైకాపా ప్రభుత్వ హయాంలో 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పిఠాపురం మున్సిపాలిటీకి 55 పనుల కోసం రూ. 7.73 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పలు వార్డుల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి 28 పనులను రూ. 3.19 కోట్ల వ్యయంతో చేపట్టారు. అయితే, ఈ పనుల్లో నాణ్యత లోపించిందని, కొన్ని చోట్ల పనులు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.ఈ ఆరోపణలపై స్పందించిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు జరిపిన విచారణలో ఇంజనీరింగ్ అధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. పనుల నాణ్యత లోపించడంతో పాటు, చేయని పనులకు బిల్లులు చెల్లించినట్లు తేలడంతో, నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఐదుగురు అధికారులపై చర్యలు చేపట్టింది.

## పోలీసుల అదుపులో ఉన్న దేవ్‌జీ సహా 50 మందిని కోర్టులో హాజరుపరచాలి: మావోయిస్టుల డిమాండ్

**దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నారన్న దండకారణ్య కమిటీ**
**హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకమని వ్యాఖ్య**
**ఎన్‌కౌంటర్లకు నిరసనగా 30న దండకారణ్యం బంద్**



మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీతో పాటు తమకు చెందిన మరో 50 మంది నాయకులు, కార్యకర్తలు పోలీసుల అదుపులో ఉన్నారని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) సంచలన ఆరోపణలు చేసింది. అదుపులో ఉన్న వారందరినీ తక్షణమే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి వికల్ప్ పేరుతో నిన్న ఓ ప్రకటన విడుదలైంది.
ఈ నెల 22వ తేదీతో ఉన్న ఈ లేఖలో, ఇటీవలే జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈ నెల 18న హిడ్మా సహా ఆరుగురిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేశారని ఆరోపించింది. ఆ తర్వాతి రోజే, అంటే నవంబర్ 19న, అదే ప్రాంతంలో సురేశ్, శంకర్ సహా మరో ఏడుగురిని కూడా ఇలాగే హత్య చేశారని లేఖలో పేర్కొంది.
ఈ బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈ నెల 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం బంద్‌ను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ప్రస్తుతం ఈ ప్రకటన తీవ్ర కలకలం రేపుతోంది. అయితే, మావోయిస్టుల ఆరోపణలపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక స్పందన రావాల్సి ఉంది.

## ఏపీలో గ్రామ పంచాయతీల విభజన, పునర్వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేత

**కొత్త పంచాయతీల ఏర్పాటు, విలీనాలకు మార్గం సుగమం**
**2020లో ఎన్నికల నేపథ్యంలో విధించిన నిషేధాన్ని తొలగించిన ప్రభుత్వం**
**పంచాయతీరాజ్ కమిషనర్ విజ్ఞప్తి మేరకు కీలక నిర్ణయం**
**ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వుల జారీ**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణపై కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల విభజన, విలీనం, పునర్వ్యవస్థీకరణపై గత ఐదేళ్లుగా అమల్లో ఉన్న నిషేధాన్ని తక్షణమే ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్నవాటిని సమీప పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేసేందుకు మార్గం సుగమమైంది.వివరాల్లోకి వెళ్తే.. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు 2020 మార్చిలో ప్రభుత్వం పంచాయతీల పునర్వ్యవస్థీకరణపై పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. దీని ప్రకారం, పెద్ద గ్రామ పంచాయతీలను విభజించడం, చిన్న పంచాయతీలను సమీపంలోని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో విలీనం చేయడం వంటి ప్రక్రియలు నిలిచిపోయాయి.అయితే, ఈ నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, నిషేధాన్ని తొలగించాలని నిర్ణయించింది.ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ జీవో నెం. 97ను జారీ చేశారు. తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఈ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

## పవన్ కల్యాణ్ రాజోలు పర్యటనలో అపరిచిత వ్యక్తి కదలికలు

**రాజోలు**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజోలు పర్యటనలో భద్రతాపరమైన ఆందోళన కలిగించే సంఘటన చోటుచేసుకుంది. ఈ నెల 26న ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో, ఓ అపరిచిత వ్యక్తి ఆయనకు అత్యంత సమీపంలో అనుమానాస్పదంగా సంచరించడం కలకలం రేపింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా పరిగణించి, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, సమగ్ర విచారణ చేపట్టాలని కోరింది.వివరాల్లోకి వెళితే, నవంబర్ 26న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజోలు నియోజకవర్గంలోని శంకరగుప్తం డ్రెయిన్ కారణంగా నష్టపోయిన కొబ్బరి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో, అధికారులతో ఆయన మాట్లాడుతున్న సమయంలో ఓ వ్యక్తి ఆయనకు చాలా దగ్గరగా ఉంటూ అనుమానాస్పదంగా తిరిగాడు. ఆ తర్వాత జరిగిన ఇతర కార్యక్రమాల్లోనూ అతని కదలికలు అసాధారణంగా ఉన్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు.ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, సదరు వ్యక్తి రాజోలు నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తగా తెలిసింది. అతని వ్యవహార శైలి, నిరంతరం ఉప ముఖ్యమంత్రికి సమీపంలోనే ఉండేందుకు ప్రయత్నించడం వంటి అంశాలు పలు అనుమానాలకు తావిచ్చాయి. దీంతో ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు వెంటనే స్పందించారు.ఈ విషయాన్ని కోనసీమ జిల్లా ఎస్పీకి అధికారికంగా తెలియజేశారు. ఆ వ్యక్తి కదలికలపైనా, అతనికి కార్యక్రమ పాస్ ఎలా లభించిందనే దానిపైనా తమకున్న సందేహాలను వివరించారు. ఉన్నత స్థాయి భద్రత ఉండే ఉప ముఖ్యమంత్రి కార్యక్రమానికి అతను ఎలా ప్రవేశించాడనే కోణంలో లోతైన విచారణ జరపాలని కోరారు. ఈ ఫిర్యాదుతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సదరు వ్యక్తి ఎవరు, అతని నేపథ్యం ఏంటి, అతని ఉద్దేశం ఏమిటనే దానిపై విచారణ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

## 4న భారత్‌కు పుతిన్

**న్యూఢిల్లీ, నవంబరు 28:**

సుదీర్ఘకాలం నుంచి మిత్రదేశాలుగా ఉన్న భారత్, రష్యా సంబంధాలు నూతన శిఖరాలకు చేరనున్నాయి. వచ్చే నెల 4, 5 తేదీల్లో భారత్‌లో పుతిన్ పర్యటించనున్న నేపథ్యంలో రక్షణ, దౌత్యపరమైన బంధాలతోపాటు పలు ఇతర అంశాల్లో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. భారత్‌లో పుతిన్ పర్యటన వివరాలను విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. "ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటిస్తారు. 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు" అని వెల్లడించింది. పుతిన్‌కు గౌరవార్థం రాష్ట్రపతి విందు ఇవ్వనున్నట్టు తెలిపింది. భారత్‌పై అమెరికా అడ్డగోలు టారిఫలు, రష్యాపై ఆంక్షలు, రష్యా చమురు కొనుగోలు చేయవద్దన్న ఒత్తిడుల నేపథ్యంలో.. పుతిన్ భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్‌కు మరిన్ని ఎస్-400 క్షిపణి రక్షక వ్యవస్థలు, రెండు స్క్వాడ్రన్ల ఎస్‌యూ-57 ఫైటర్ల సరఫరా, ఇరు దేశాల మధ్య స్థానిక కరెన్సీలో లావాదేవీలు, పౌరఅణుశక్తి రంగంలో మరింత సహకారం, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుకు సంబంధించి కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది.

## బిహార్ ఓటమికి నేనూ బాధ్యుడినే..

**న్యూఢిల్లీ, నవంబరు 28 :**

బిహార్‌లో కాంగ్రెస్ ఓటమికి స్థానిక నాయకులతో సమానంగా తాను కూడా బాధ్యుడినేనని ఆ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నట్టు సమాచారం. బిహార్ ఎన్నికల కోసం పనిచేసిన నాయకులు, పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులతో కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం అంతర్గత సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగానే రాహుల్ పై వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈసీ చేపట్టిన 'సర్' ప్రక్రియ వల్లే బిహార్‌లో ఓడిపోయామని నేతలు తేల్చినట్టు తెలిసింది. ఓటమినే తలుచుకుని బాధపడకుండా, ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించాలని రాహుల్ ఈ సమావేశంలో నేతలకు హితబోధ చేసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. "వ్యవస్థాగత బలహీనతలే కాంగ్రెసను దెబ్బతీశాయనే వాదనను రాహుల్ సమావేశంలో అంగీకరించలేదు. అదే నిజమైతే గట్టి పార్టీ నిర్మాణాలు కలిగిన ఆర్జేడీ, వామపక్షాలు ఎందుకు ప్రభావం చూపలేకపోయాయని ఆయన ప్రశ్నించారు. ఏఏ అంశాలు బిహార్‌లో పార్టీని దెబ్బతీశాయనేది నిర్దిష్టంగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని ఆయన దిశానిర్దేశం చేశారు" అని ఓ నేత తెలిపారు. కాగా, ప్రాణాంతకంగా మారిన ఢిల్లీ వాయు కాలుష్య సమస్యపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరపాలని కేంద్రాన్ని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

### గ్రామ పంచాయతీ ఎన్నికలు..

## రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారు

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆయన ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో పర్యటించనున్నారు. డిసెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ఆయన పర్యటన కొనసాగనుంది.డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్, డిసెంబర్ 2న ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, డిసెంబర్ 3న కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, డిసెంబర్ 4న ఆదిలాబాద్, డిసెంబర్ 5న నర్సంపేట, డిసెంబర్ 6న నల్గొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతాల్లో ఆయన పర్యటన సాగుతుంది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. మూడు దఫాలుగా ఎన్నికలు జరగనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. మొదటి దశ నామినేషన్లు నవంబర్ 27న ప్రారంభం కాగా పోలింగ్ డిసెంబర్ 11వ తేదీన జరగనుంది. రెండవ దశ నామినేషన్లు నవంబర్ 30న, మూడవ దశ నామినేషన్లు డిసెంబర్ 3న ప్రారంభం కానుండగా, రెండో దశ పోలింగ్ డిసెంబర్ 14న, మూడో దశ పోలింగ్ 17న జరగనుంది.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే గారి వర్ధంతి



**ఆదోని అర్బన్ పల్లె వెలుగు నవంబర్ 27**
ఆదోనిలో వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు మహాత్మా జ్యోతి పూలే వర్ధంతి వేడుకలు వైసిపి నాయకులు ఘనంగా నివాళులర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ మరియు పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ "బడుగు బలహీన వర్గాలకి ఆశాజ్యోతి, సామాజిక సమానత్వానికి మార్గదర్శి, మహిళా విద్యా పురోగతికి శిల్పి, నిత్యస్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే గారి సేవలు చిరస్థాయిగా నిలిచివుంటాయి. వారి స్ఫూర్తితోనే సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడానికి మా పార్టీ కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మన్సూర్, అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, గంగాధర్, వెంకటేష్, బుల్లెట్ ఈరన్న, మనీ బాబు, పరిగెల నారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకున్న టి.జి. కృష్ణ జ్యోత్స్న



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**
కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి. వెంకటేష్ కుటుంబ సభ్యులు, వారి పెద్ద కుమార్తె టి.జి. కృష్ణ జ్యోత్స్న ఈరోజు శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. బెంగుళూరు నుండి తన స్నేహితురాళ్లతో కలిసి విచ్చేసిన ఆమె, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దత్తపీఠం పరిధిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులను అడిగి దేవాలయ విశిష్టతను, స్థల పురాణాన్ని ఆసక్తిగా తెలుసుకున్నారు. అనంతరం స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



**ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 28**
ప్రతి ఏడాది జరిగే శ్రీశ్రీశ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా మాజీ సీఎం, నటసర్వభోమా స్వర్గీయ ఎన్టీఆర్ మరియు మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గజమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత 9 ఏళ్ల నుండి బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మిగనూరు క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు ప్రోత్సహించా లంటే ఒక టీడీపీ ప్రభుత్వంతో సాధ్యమవుతుంది అన్నారు. ప్రతి క్రీడాకారుడు ఓటమి గెలుపును సమానంగా స్వీకరించి ముందుకు పోవాలని సూచించారు. ఎమ్మిగనూరు క్రీడాకారుల పాటు అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ లో దాదాపు 130 జట్లు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులను సూచించారు. అనంతరం క్రికెట్ ఆడి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య , భాస్కర్ల చంద్ర శేఖర్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు, క్రీడాకారులు, టిడిపి నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలి

## ముఖ్యమంత్రి సహాయ నిధి 39 మందికి 13,69,152 లక్షల రూపాయల చెక్కులు పంపిణీ

## ప్రభుత్వం అందించే సహాయం నిజమైన లబ్ధిదారుల చేతికి చేరేలా చూడటం మన బాధ్యత

## ఆదోని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కొంకా మీనాక్షి నాయుడు



**ఆదోని పల్లె వెలుగు నవంబర్ 28**
ఆదోని మాజీ శాసనసభ్యులు, ఆదోని నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు చేతులమీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ ప్రజలకు అండగా నిలిచే శ్రేయోభిలాషి నేతగా పేరుగాంచిన టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయుడు, బాధిత కుటుంబాలకు సీఎం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్వయంగా అందజేశారు.ప్రజల అండదండగా ఉండే నాయకుడే నిజమైన ప్రజానాయకుడు మన మాన్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అందించే సహాయం నిజమైన లబ్ధిదారుల చేతికి చేరేలా చూడటం మన బాధ్యత. మన ప్రభుత్వం అందిస్తున్న ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి. అదే మన లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదోని నియోజవర్గంలో 39 మందికి గాను రూ.13,69,152 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.మాకు వచ్చిన అప్లికేషన్స్ 506 మంది లబ్ధిదారులు మాకు ఇచ్చారు ఇవన్నీటి కాను మేము ఇచ్చిన 264 మందికి ఇప్పటిదాకా చెక్కులు లబ్ధిదారులకు ఇచ్చాము ఇక ఇవ్వాల్సినవి 242 అప్లికేషన్స్ ఇంకా పెండింగ్లో ఉన్నాయి అవి కూడా కొద్ది రోజుల్లో ఇచ్చిన ముఖ్యమంత్రి సహాయ నిధి అప్లికేషన్ ఇచ్చిన వాళ్లు కూడా సాంక్షన్ చేసుకొని ఇస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు మరియు నాయకులు కార్యకర్తలు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు తీసుకున్న వ్యక్తులు, పాల్గొనడం జరిగింది.

# ప్రజా సమస్య ల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ ) కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే గౌరవనీయులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి గారు



**బేతంచెర్ల నవంబర్ 28 పల్లె వెలుగు ప్రతినిధి**
డోన్ ఎమ్మెల్యే గౌరవనీయులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా బేతంచర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే గారికి వివరించారు. ఎమ్మెల్యే గారు ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పౌరులు సమర్పించిన పెండింగ్ అర్జీలపై సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెలల తరబడి పరిష్కారం కోసం వేచి ఉన్న కొన్ని వినతులను గుర్తించి, వాటి పురోగతిని ఎందుకు ఆలస్యమవుతుందో వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గారు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏ శాఖ కూడా అనుమతించబడదని స్పష్టం చేస్తూ, పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్జీని ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కఠినంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సంచార కేంద్రం తనిఖీ



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 28 :** సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి శుక్రవారం బండి ఆత్మకూరులో పర్యటించారు. గ్రామానికి సమీపంలో ఉన్న ఎరుకల కాలనీ నీ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ బండి ఆత్మకూరు వైద్య బృందం నిర్వహిస్తున్న సంచార కేంద్రాన్ని నోడల్ అధికారి తనిఖీ చేశారు. ఎన్సీడీసీ మరియు ఎల్ సి డిసి సర్వేల గురించి వైద్య సిబ్బందికి తగు సలహాలు,సూచనలు చేశారు. వైద్య శాఖకు సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించారు.ఈ ప్రోగ్రాం లో వైద్యాధికారి భావనా రెడ్డి ఏఎన్ఎం భాగ్యరత్నమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# టిడిపి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్



**ఆదోని రూరల్ పల్లె వెలుగు నవంబర్ 28**
పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజా సమస్యల ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారానికి దిశానిర్దేశం చేయడానికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు వెంటనే సూచనలు జారీ చేశామన్నారు.గ్రామాలు, పట్టణం లో నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ సమస్యలు తెలియజేశారు.పేదల సమస్యలు,రెవిన్యూ సమస్యలు, కిసాన్, పింఛన్, ఇళ్ల, రేషన్, రోడ్లు, డ్రైనేజ్ వంటి అంశాలపై ప్రత్యేకంగా స్పందించారు.ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం అనే మూడు దశల్లో ఫాలోఅప్ ఏర్పాటు చేశామన్నారు.
ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులోనే ఉంటు వారి కుటుంబాలకు భరోసా టిడిపి నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, కరణం రంగస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా మండలాల పునర్ విభజన

## ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహమ్మద్

## ఆదోని జిల్లా పోరును పక్కదారి పట్టించడమే దీనికి నిదర్శనం

## ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను కొత్త మండలంలో కలపడం ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే మండలాల విభజన




**ఆదోని పల్లె వెలుగు నవంబర్ 28**
ఆదోని జిల్లా పోరును దారి తప్పించేందుకే ఆదోని మండల అడ్డగోలు విభజన జరిగినదని అనుమానించవలసి వస్తోంది. ఆదోనికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న కొన్ని గ్రామాలను ముప్పై కిలోమీటర్ల దూరం ఉన్న పెద్ద హరివాణం మండలంలోకి కలపటం చూస్తుంటే ఇక్కడ ప్రజలు ఆదోని జిల్లా పోరు వదిలి మండల కేంద్రం గొడవలో పడేలా చేయటమే ఈ కుట్ర వెనుక ఉద్దేశ్యం కనిపిస్తోంది. ఈ కుట్రకు కారకులెవరో ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథి చెప్పాలి. ఇలాంటి కుట్రలతో ఆదోని జిల్లా సెంటిమెంటును దెబ్బ తీయలేరని హెచ్చరిస్తున్నాము. ఎంత తొక్కాలని చూసినా ఆదోని జిల్లా సాధన పోరాటం ఆగదు అని స్పష్టం చేస్తున్నాము. ఆదోని జిల్లా ఆవశ్యకతను, పోరాటానికి పెరుగుతున్న ప్రజా మద్దతు గుర్తించిన నాయకులు పోరాటానికి మద్దతు పలకటాన్ని ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక తరపున ఆహ్వానిస్తున్నాము. కోర్టు కేసుల గొడవ రాకుండా పెద్ద హరివాణం మండలం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాము. పెద్ద తుంబళం మండల ఏర్పాటుకు ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక మద్దతు తెలుపుతోంది.

# బనగానపల్లి కొత్త రెవెన్యూ డివిజన్‌గా గెజిట్ విడుదల

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

బనగానపల్లిని నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని 30 రోజుల లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆమె సూచించారు. గెజిట్ నోటిఫికేషన్‌ను అన్ని గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు మరియు రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో ప్రచురించేందుకు చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను తెలుగు మరియు ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేసినట్లు కూడా కలెక్టర్ తెలిపారు.

# నంద్యాలలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు

### మహాత్మ పూలే ఆశయాల సాధనకై కృషి చేస్తాం : టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్



**పల్లె వెలుగు నంద్యాల**

సామాజిక సంస్కరణోద్యమ పితామహుడు, మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా నంద్యాల పట్టణంలో శుక్రవారం పద్మావతి నగర్ ఆర్చి దగ్గర ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ "బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్య అందించడం కోసం, ముఖ్యంగా మహిళా విద్య కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు ఈ తరానికి, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయం అన్నారు . కుల వ్యవస్థను, సాంఘిక అసమానతలను రూపుమాపడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని" కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, మహాత్మ పూలే ఆశయాల సాధనే యువత లక్ష్యంగా పెట్టుకోవాలని ఎన్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని పూలే ప్రగాఢంగా నమ్మారని, ఆయన స్ఫూర్తితోనే ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పృథ్వీరాజ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు , చల్లా గోపాల్ యాదవ్, గోవిందు నాయుడు, కామిని మల్లికార్జున, మధు సాయి , దీపక్ , అక్బర్, షాకీర్, బేగ్, ఓబులేష్ మరియు టిడిపి నాయకులు, బీసీ సామాజిక వర్గాల ప్రముఖులు పాల్గొని పూలే సేవలను స్మరించుకున్నారు.

# విరిపాపురంలో రైతన్న మీకోసం



**ఆదోని రూరల్ పల్లె వెలుగు నవంబర్ 28**

మండల పరిధిలోని విరుపాపురం గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖలు మరియు టిడిపి నాయకులు ఎమ్మెల్సీ బీడీ నాయుడు, మా పతి నాయుడు ఆధ్వర్యం లో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ఆధ్వర్యంలో మరియు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు పాల్గొన్నారు. గ్రామ%శీ% లో రైతులతో కలిసి ఇంటింటికి తిరిగి రైతన్నా-మీకోసం పా%శీ%ప్లెంట్ పేపర్ లు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం లో రైతులకు అండగా అమలుచేసిన పథకాల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ రాష్ట కూటమి ప్రభుత్వం రైతన్నా-మీకోసం పంచ సూత్రాలతో చంద్రన్న వ్యవసాయ రంగం లో పెనుమార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు ఈ నెల 24 నుండి 29 వరకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వాల మద్దతు అనే పంచ సూత్రాల విధ%శీ%తో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలి అనే లక్ష్యం తో కూటమి సర్కార్ అందిస్తోంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం దొర్నిపాడు మండలం గుండుపాపుల గ్రామం సందర్శించారు. కలెక్టర్ రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాల లబ్ధి అందుతున్న విధానంపై రైతులు వెంకటేశ్వర్లు, చిన్న దస్తగిరిని వివరాలు అడిగారు. స్పందించిన రైతులు మొదటి విడతలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 5,000/- పీఎం కిసాన్ కింద రూ.2,000/-, రెండో విడతలో మరోసారి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 5,000/- పీఎం కిసాన్ కింద రూ.2,000/- వెరసి మొత్తం రూ.14,000/- తమ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ కు నివేదించారు. ఇంకా రైతులకు ఎలాంటి మద్దతు అవసరమో తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ మరియు ఉద్యాన శాఖల ద్వారా లభించే అవకాశాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వినియోగం, ప్రత్యేకంగా యూరియా సరైన విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు కోయిలకుంట్ల వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, దొర్నిపాడు తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, స్థానిక సర్పంచ్ అధికారులు పాల్గొన్నారు.

# 30న మచిలీపట్నంలో గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశం

### గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి
### ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్
### నంద్యాల జిపిఎస్ కార్యాలయంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



**పల్లె వెలుగు నంద్యాల రూరల్**

మచిలీపట్నంలో ఈ నెల 30న నిర్వహించే గిరిజన ప్రజా చైతన్యయాత్ర రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని స్థానిక జిపిఎస్ కార్యాలయంలో గిరిజన ప్రచార చైతన్యయాత్ర వాల్పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా కూడు, గూడు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నార న్నారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయా ల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ రాష్ట్రంలోని లక్షలాది మంది గిరిజనులకు రేషన్కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. దీని కారణంగా సంక్షేమ ఫలాలు అందుకోలేక పోతున్నారన్నారు. భవిష్యత్తులో పునర్విభజన జరుగుతున్న నేపథ్యంలో జిల్లాను యూనిట్గా తీసుకుని రిజర్వేషన్లను అందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతి అభ్యున్నతికి ప్రజాచైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, గిరిజన విద్యార్థి సమాఖ్య రాయలసీమ జిల్లా అధ్యక్షుడు రవీంద్రా నాయక్, జాయింట్ సెక్రెటరీ బాలనాయక్, రవి నాయక్, పుల్లన్న నాయక్, కటారి కృష్ణ నాయక్, తదితరులు పాల్గొ న్నారు.

# బ్రహ్మంగారి మఠం ఉత్సవాలకు టీటీడీ పట్టువస్త్రాలు సమర్పించాలి

### టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ వినతి
### సానుకూలంగా స్పందించిన చైర్మన్



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

కడప జిల్లాలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో జరిగే ప్రధాన ఉత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరఫున అధికారికంగా పట్టువస్త్రాలు సమర్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె టీటీడీ బోర్డు చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బి.ఆర్. నాయుడు)ను కలిసి వినతిపత్రం అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 25 లక్షల విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు ఆరాధ్య దైవమైన వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో జరిగే మూడు ప్రధాన ఉత్సవాలకు టీటీడీ నుంచి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని ప్రారంభించాలని కోరారు. **ఆయా ఉత్సవాల వివరాలు:** లి ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన జరిగే వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల కల్యాణోత్సవం. వైశాఖ శుద్ధ దశమి రోజున జరిగే స్వామివారి ఆరాధన ఉత్సవం. మార్గశిర బహుళ నవమి నాడు జరిగే ఈశ్వరి మాత ఆరాధన ఉత్సవం. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా, భావితరాలకు బ్రహ్మంగారి చరిత్రను తెలియజేసేలా ఈ నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని పాలకమండలి దృష్టికి తీసుకెళ్లి, ఆమోదం పొందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధనాలకోట శోభన్ బాబు, డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పేరును అప్రతిష్టపాలు చేస్తున్న బిల్డర్ పబ్బతి వేణు

### సిపిఐ
### మంత్రి పేరు చెప్పి ఆర్యవైశ్యులకు అన్యాయం చేస్తే సహించం
### ప్రజలకు మోసం చేసి బతికేవారు కమ్యూనిస్టులను విమర్శించే అర్హత హక్కు లేదు
### సిపిఐ పట్టణ సమితి

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

నంద్యాల పట్టణంలో దశాబ్ద కాలంగా మచ్చలేని నాయకులు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ ని, గత ఎన్నికల సందర్భంగా కోట్ల రూపాయలు నిధులు ఇచ్చానని వాటికి ఫలితంగా మున్సిపల్, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, డిపార్ట్మెంట్ నాకు అప్పచెప్పారని వాటి మీద వచ్చే ఆదాయం నాకే చెందాలని బిల్డర్ పబ్బతి వేణు ఆ మూడు విభాగాల్లో ఏ పని జరిగినా గాని తనకి చెప్పి జరగాలని అధికారులకు అజమాయిషి చేయడము పట్టణ ప్రజలు గమనించాలని, ఇలాంటి వారిని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజలకు కోట్ల రూపాయలు డబ్బులను ముంచి బ్రతికే వారు కమ్యూనిస్టులను విమర్శించే హక్కు లేదని, మంత్రి పేరు చెప్పి ఆర్యవైశ్య కుటుంబాన్ని అన్యాయం చేస్తే సహించం అని, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, జి లక్ష్మీదేవి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్ సుశీలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో బిల్డర్ పబ్బతి వేణు ఆర్యవైశ్య ప్రముఖులు తాళ్లపల్లి వీరయ్య కుటుంబాన్ని అన్యాయం చేస్తుంటే వాటి మీద స్పందించిన సిపిఐ జిల్లా పార్టీ నాయకత్వం ఆర్య వైశ్య కుటుంబాలకు అండగా నిలబడితే ఓర్వలేని అక్రమాల కాంట్రాక్టర్ల గ్యాంగ్ వారి కుటుంబానికి అండగా నిలబడక అవినీతిపరుడైన పబ్బతి వేణుకు అండగా ఒక సంఘం పేరుమీద చందాలపై దందా అని పెట్టడం ప్రజలు గమనిస్తున్నారని, మీకు దమ్ముంటే చేతనైతే తాళ్లపల్లి వీరయ్య కుటుంబానికి అండగా నిలబడి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు పైన అవాకులు చవాకులు పేలితే తగిన గుణపాఠం చెప్తామని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే కమ్యూనిస్టు నాయకత్వం ప్రజా పోరాటలకు నాయకత్వం వహిస్తూ ఎవరికి అన్యాయం జరిగినా సిపిఐ పార్టీ ముందుంటుందని, రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ పబ్బతి వేణు లాంటి అక్రమాల అవినీతిపరులను అదుపులో పెట్టాలని సిపిఐ పట్టణ సమితి నాయకులు హితువు పలికారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అన్న ఎమ్మెల్యే



**సి బెళగల్ పల్లెవెలుగు నవంబర్ 28**

సి బెలగల్ మండలంలోని గుండ్రేవుల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని రైతుల ఇంటింటికి తిరిగి రైతన్న మీకోసం పాంప్లెట్ పేపర్లు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వంలో రైతులకు అండగా అమలు చేసిన పథకాలను గురించి ప్రభుత్వ అధికారులు నాయకులతో కలిసి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని రైతు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడడమే ప్రభుత్వ లక్ష్యమని రైతులపై చెల్లింపు భారాన్ని తగ్గించే నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటుందని వివరించారు రైతు సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన 0% శాతం వడ్డీ పథకం పంట నష్టపరిహారం విత్తనాలు ఎరువుల సరఫరా వంటి అంశాలలో ప్రభుత్వం చూపుతున్న వేగం పారదర్శకత గ్రామీణ వ్యవస్థలో నమ్మకం పెంచుతుందని అన్నారు పెరుగుతున్న వ్యయలు నీటి సమస్యలు ధరల ఊపిరాడని పరిస్థితుల నుంచి రైతులను బయటకు తీయడం కోసం ప్రత్యేక కమిటీల ద్వారా క్రమం తీర్మానాలు జరుగుతాయని తెలిపారు రైతులకు అడుగడుగున ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు . గ్రామ డ్రైనేజీ కాలువల సమస్యలు నేరుగా చూసిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి డ్రైనేజీ కాలువ సమస్యలను ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ వ్యవసాయ సహాయ సంచాలకులు సాల్ రెడ్డి వైద్య అధికారి రిచర్డ్ గుండ్రేవుల గ్రామానికి సంబంధించిన రైతులు నాయకులు గుండ్రేవుల బాబు గంగన్న డాక్టర్ చిన్న తిమ్మప్ప మండల కన్వీనర్ చంద్రశేఖర్ పోల్కల్ అమర్ వ్యవసాయా అధికారులు పాల్గొన్నారు

# ద్విత్వా తుఫాను పట్ల రైతులు అప్రమత్తంగాఉండాలి



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 28 :** ద్విత్వా తుఫాను ప్రభావంతో నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బండి ఆత్మకూరు మండలం రైతులు వివిధ పంటలలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. మండలంలో అధిక విస్తీర్ణంలో సాగుచేసిన వరి జొన్న మొక్కజొన్న మరియు మినుము పంటలలో రైతన్న ఆచరించవలసిన యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. వరి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రస్తుతం వరి పంట గింజ గట్టిపడే దశ మరియు పూత దశలో ఉన్నది. ఈ వర్షాల వలన గింజలు రాలడం గింజల రంగులు మారడం మరియు వివిధ బ్యాక్టీరియా ఎండాకు మరియు మామిడి తెగులు వ్యాపించే ప్రభావం ఉందని అన్నారు.అధిక వర్షాల వలన గింజలు వెంటనే మొలకెత్తి అవకాశం ఉందని పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలని అన్నారు.ఎక్కువగా నీరు నిలిచిన చోట పెద్దకాలువలు చేసి మోటార్ల ద్వారా ఆ నీటిని తొలగించాలని అన్నారు. గింజలు రంగు మారటం మామిడి తెగులు మరియు మానిపండి తెగులు వ్యాప్తి నివారించడానికి 2.5 లీటర్ల ప్రొపీ కోనజోల్ పిచికారి చేయాలని అన్నారు.నిలిచిన లేదా పడిపోయిన పంటల కంకిలో మొలకలు కనపడితే 5% ఉప్పు ద్రావణం ( 50 గ్రాముల స్ఫటిక ఉప్పు / లీటర్ నీటికి) కలిపి పిచికారి చేయాలని అన్నారు. ఇది మొలకలు మరియు రంగు మార్పును తగ్గిస్తుందని అన్నారు కోత సమయంలో అకాల వర్షాలకు నేల కోరిగే అవకాశం ఉన్నదని అన్నారు. దీనితో పాటు పడిపోయిన చేనుల నుండి వచ్చే దాన్యం మి ల్లింగ్ సమయంలో విరిగిపోయి నూకయ్యే వచ్చే అవకాశం ఉందని అన్నారు.కోతకోసిన పొలం లో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లైతే నీరు పూర్తిగా బయటకు పోవడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గింజ మొలకెత్తకుండా ఉండటానికి 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారి చేయాలని ఏవో పేర్కొన్నారు. జొన్న మరియు మొక్కజొన్న పంట మొలకెత్తి దశ నుంచి శాఖీయ దశలలో ఉన్నదని పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని అన్నారు. ఎకరాకు 20 -30 కిలోల యూరియా మరియు 20 కిలోల పొటాష్ ఎ రువులు పైపాటుగా వేయాలని అన్నారు నేల ఇంకా తడిగా ఉంటే రెండు శాతంయూరియా లేదా 5- 10 గ్రాములు 19 -19-19 చొప్పున లీటర్ నీటికి కలుపుకొని పైపాటుగా పిచికారి చేసుకోవాలని అన్నారు. మొవ్వ తులసి ఈగ/ కాండం తొలిచూపు ఉధృతి ఎక్కువ రావడానికి అవకాశం ఉంది. వీటి నివారణకు క్లోరంట్రా నీలిప్రోలు 0.3 మి.లీ / లాం సై హాలోట్రిన్ 0.5 మి. లీ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. ఆకు ఎండు తెగులు ఆంధ్రాక్నోస్ మరియు బూజు తెగులు ఉధృతి ఎక్కువైనట్లయితే నివారణకు వర్షం ఆగిన తర్వాత మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రోఫీకోనజోల్ ఒక మిల్లీలీటరు పిచికారి చేసుకోవాలని పంటకోత పూర్తయిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లోకి తరలించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం బికోడురు గ్రామంలో రైతులు భక్తుల గోపాల్ నలబోతుల భాస్కర్ సాగుచేసిన వరిమడుగలను పరిశీలించారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతిని పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించిన విద్యార్థి యువజన ప్రజాసంఘాలు

**పల్లె వెలుగు నంద్యాల రూరల్**

నంద్యాల పట్టణంలోని స్థానిక పద్మావతి నగర్ ఆర్చ్ వద్ద వున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా పూలమాలలతో విద్యార్థి యువజన ప్రజాసంఘాలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షులు షేక్. రియాజ్,రిజర్వేషన్ల పరిరక్షణ సమితి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, ఎన్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల మోహన్ రావు,బిఎస్పీ అసెంబ్లీ ఇన్చార్జ్ అధ్యక్షులు శీను,జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే ప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే అంటరానితనం,కుల వ్యవస్థ, మహిళల పట్ల వివక్ష నిర్మూలనకు ఆయన కృషి చేశారని,మహారాష్ట్ర లో సాంఘిక సంస్కరణ ఉద్యమంలో ముఖ్యమైన వ్యక్తిగా పూలే ను గుర్తించారని అన్నారు . భారత దేశంలో మహిళల విద్యకు మార్గదర్శకులుగా నిలిచిన ఘనత పూలేదన్నారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి జ్యోతిరావు పూలే బహుజనుల హక్కుల కోసం ఉద్యమించిన వ్యక్తి పూలే గారని ఆయన అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వర్ధంతిలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ



నాయకులు, దాసరి చింతలయ్య,ఆర్.పి.యస్ నంద్యాల జిల్లా యువజన సంఘం అధ్యక్షులు బిజినవేముల శ్రీనివాసులు,జాతీయ బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పృధ్వీరాజ్ నంద్యాల జిల్లా కన్వీనర్,దస్త గిరిబాబు,బిఎస్పీ సీనియర్ నాయకులు న్యాయవాది, శ్రీనివాసులు , పురుషోత్తం , విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులుచిరుధాన్యాల సాగుపై మక్కువ చూపాలి కలెక్టర్



**దొర్నిపాడు నవంబర్ 28 పల్లె వెలుగు న్యూస్**

ప్రస్తుతం ఆహారపు అలవాట్లు మారినందున వాటికి అనుగుణంగా చిరుధాన్యాలు, పాక్ఆయిల్ వంటి పంటల సాగుపై రైతులు మక్కువ చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుండుపాపల గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. ఈసందర్భంగా రైతు లు సాగుచేసిన పంటలపై ఆరా తీశారు. నీటి భద్రతలో భాగంగా ప్రతి ఎకరానికి నీరు ఇవ్వడమే లక్ష్యం అన్నారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా పొలం గట్ల వెంట కొబ్బెరి చెట్లునాటుకోవచ్చన్నారు. రైతులకు డ్రిప్ మరియు స్పింకర్లురాయతీ రూపంలో ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలతో ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. పాడి రైతులకు కావాల్సిన పెట్టుబడులు పరిశ్రమల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వెంకటేశ్వర్లు, ఏడీఏ సుధాకర్, తహసీల్దార్ సుభద్ర, ఏఓ ప్రమీల, ఎంపీడీఓ సావిత్రి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా “పోలీస్ సంక్షేమ దివస్” (గ్రీవెన్స్ డే)” ఏర్పాటు

## సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత




**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్**

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు “పోలీస్ సంక్షేమ దివస్” (గ్రీవెన్స్ డే)” ను నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది, హెూంగార్డ్స్ వారి యొక్క సమస్యల గురించి ఎస్పీ కి తెలియచేసినారు. జిల్లా ఎస్పీ సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలిసికొని వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు.ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ,పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు.విధుల్లో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియ చేసినారు.

# జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా పద్మావతి నగర్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఘన నివాళులర్పించిన నంద్యాల కాంగ్రెస్ కమిటీ



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

మహాత్మ జ్యోతిబాపూలే 135 వ వర్ధంతి సందర్భంగా పద్మావతి నగర్లో విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నంద్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి చింతలయ్య ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు మాట్లాడుతూ ఆ రోజుల్లో సోషల్ మీడియా లేని సమయంలోనే జ్యోతిబాపూలే విద్యతోనే మన బడుగు బలహీన వర్గాల్లో చైతన్యం సాధ్యమని మహిళా విద్య కై పాఠశాలను స్థాపించి సత్యశోధకు సమాజ్ ద్వారా సామాజిక చైతన్యం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి అని జ్యోతిబాపూలే కి ఘన నివాళులర్పిస్తూ తెలిపారు. జ్యోతిబాపూలే మరియు బిపి మండల్ లాంటి మహనీయుల స్ఫూర్తితో బీసీలంతా ఐక్యతతో ముందుకు సాగి చట్టసభల్లో రిజర్వేషన్లకై పోరాడాలని తద్వారా రాజ్యాధికారం దక్కుతుందని రాజ్యాధికారం ద్వారానే సమాజంలో అసమానతలు తొలగుతాయని సమ సమాజం సాధ్యమని తెలిపారు. బీసీలలో ఐక్యత కోసం జ్యోతిబాపూలే లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అయ్యారని అందుకే ఈ తరం వారు కూడా బాబా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకై ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, మైనార్టీ సీనియర్ నాయకులు అహమ్మద్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షులు ఆనందరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# “దిత్వా” తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఈనెల 29, 30, డిసెంబర్ 1 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం

### రైతులు కోసిన ధాన్యాన్ని తార్పాలిన్ షీట్లు వేసి రక్షించుకోవాలి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**



బంగాళాఖాతంలో ఏర్పడిన “దిత్వా” వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ ప్రభావం నంద్యాల జిల్లాలో అధికంగా ఉండే అవకాశం ఉందని దీంతో శనివారం, ఆదివారం, సోమవారం 3 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యంగా మొక్కజొన్న మరియు వరి పంటల కోత పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోత కోసిన పంటను తార్పాలిన్ షీట్లు వేసి రక్షించుకోవడం, వర్షాకాలంలో తేమకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పంట దిగుబడిని ఆరుబయట కాకుండా, తప్పనిసరిగా గోడౌన్లలో లేదా భద్రమైన గదుల్లో నిల్వ చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో ప్రజలు విద్యుత్ తీగలు, చెట్లు, నీటితో నిండిన రహదారులు వద్ద జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే సమీప గ్రామ వాలంటీర్లను, సంబంధిత తహసీల్దార్ లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు సహాయం అందించేలా సిద్ధంగా ఉందని తెలిపారు.

# మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం ద్వారా గత 10 సంవత్సరాల నుంచి క్లైమ్ చేయని డబ్బు తిరిగి పొందవచ్చు

## మీ డబ్బు మీ హక్కు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం
## లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర కుమార్



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం ద్వారా గత 10 సంవత్సరాల నుంచి క్లైమ్ చేయని డబ్బు తిరిగి పొందవచ్చునని జిల్లా లేట్ బ్యాంక్ మేనేజర్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు మీ డబ్బు మీ హక్కు కార్యక్రమంపై ప్రజలకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లేట్ బ్యాంక్ మేనేజర్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ వివిధ బ్యాంకుల ఖాతాదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్బిఐ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని బ్యాంకులు సమన్వయంతో మీ డబ్బు మీ హక్కు అనే కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గత 10 సంవత్సరాల నుంచి క్లైమ్ చేయనటువంటి మీ ఖాతాలలో ఉండే డబ్బు రిజర్వ్ బ్యాంకుకు వెళ్లడం జరిగిందన్నారు. మన జిల్లాలో సుమారు 64.59 కోట్ల రూపాయలు 3.19 లక్షల మంది అకౌంటులలో ఉన్నందున ఈ డబ్బు అంతా ఆర్.బి.ఐ లో సేఫ్ గా ఉంది. ఈ డబ్బును మనం తిరిగి ఉపయోగించుకోవడానికి ఆర్బిఐ ఆదేశాల మేరకు మీ డబ్బు మీ హక్కు అనే కార్యక్రమం ద్వారా ఏ బ్యాంకుకు సంబంధించిన ఖాతాదారులకు ఆ బ్యాంకు తరపున స్టాల్స్ ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా, మెప్మా పీడీలు, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ మనోహర్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి, వివిధ బ్యాంకుల ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల 1 సచివాలయం సిబ్బంది లేక ప్రజల పడిగాపులు



**పోరుమామిళ్ల నవంబర్ 28 ( పల్లె వెలుగు)**

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ పోరుమామిళ్ల రంగసముద్రం సచివాలయం 1 ను ఈరోజు ప్రజల ఫిర్యాదు మేరకు సందర్శించడం జరిగింది ప్రభుత్వము ఈరోజు లాస్ట్ డేట్ అని చెప్పారు ఆధార్ కార్డులో చేర్పులు మార్పులు కానీ సచివాలయం వన్ లో సరైన సమాధానం చెప్పే వాళ్ళు కూడా లేరు ప్రజలు ఉదయం నుండి కూడా పడిగాపులు కాస్తున్నారు సమయపాలన పాటించని ఈ సచివాలయం సిబ్బందిని ఆర్డీవో గారు కలెక్టర్ గారు చొరవ తీసుకొని వాళ్లకు సరైన ట్రీట్మెంట్ ఇవ్వగలరు ప్రజలకు అందుబాటులో ఉండి సరైన పద్ధతిలో జవాబు చెప్పవలసి ఉన్న నిర్లక్ష్య వైఖరిగా ఆఫీసు రాకుండా జీతాలు తీసుకుంటున్న ఇలాంటి అధికారులను మరి కలెక్టర్ గారు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో ప్రజలు ఎదురుచూస్తున్నారు చాలాసార్లు ప్రజలను నిర్లక్ష్యంగా మాట్లాడడం ఏదో ఒకటి నేపముతో వాళ్లను రేపు ఎల్లుండి రమ్మనడం వాళ్ళ సొంత పనుల గురించి ప్రజలను ఇబ్బంది గురి చేస్తూ మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అనే వ్యవహారశీలు కూడా అధికారులు మాట్లాడడం జరిగినది ప్రజలతో చేస్తున్న ఇలాంటి అధికారుల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ చీఫ్ గంగన్న సెక్రటరీ ఫణి రావు కోరుతున్నారు సచివాలయం వ్యవస్థలో ఉన్న అధికారులు సరైన పద్ధతిలో ఉండాలి అంటే సంబంధిత అధికారులు వాళ్లపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు కోరుచున్నారు

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో రెండు నెలలు పాటు పొడిగింపు

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో రెండు నెలలు పాటు డిసెంబర్ 01. 2025 నుండి జనవరి 31, 2026 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గాని ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.ఎస్. విశ్వనాథన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నవంబర్, 30 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మరో రెండు నెలలు పాటు డిసెంబర్ 01. 2025 నుండి జనవరి 31, 2026 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని సమా చార పౌర సంబంధాల శాఖ సంచాలకులు తెలియజేశారు.

# బద్వేలు లో మహాత్మ జ్యోతిరావ్ పూలే 135 వ వర్ధంతి వేడుక

**బద్వేలు.నవంబర్ 28 (పల్లె వెలుగు)**

బద్వేలు పట్టణం లో గల మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద ఆయన 135 వ వర్ధంతి వేడుక కార్యక్రమం పూలే ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటి ఛైర్మెన్ బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ పూలే మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో జన్మించి నవంబర్ 28,1890 లో మరణించారు.విద్యకు దూరంగా వున్న ఆనాటి ప్రజలందరూ విద్యావంతులు కావాలని, ముఖ్యంగా మహిళలు విద్యావంతులు అయితే కుటుంబము దేశమూ అభివృద్ధి చెందుతుందని తన భార్య సావిత్రి బాయి పూలేకు విద్యనేర్పి పూణేలో 1848 లో భారతదేశం లోనే ప్రప్రధమ బాలికల పాఠశాలను ఏర్పాటుచేసిన గొప్ప సంఘసంస్కర్త,ప్రజల చేత మహాత్మ అని బిరుదు పొంది రైతుల,కార్మికుల,పేద,బడుగు బలహీన వర్గాల అసమానతలను నిర్మూలనకు అహర్నిశలు కృషిచేసిన సంఘసంస్కర్త అని ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో గల అన్ని నియోజక వర్గాల్లో పూలే బి.సి భవనాలను నిర్మించి బి.సి ల ఐక్యతకు, చైతన్యానికి,అభివృద్ధికీ కృషి చేయా లన్నారు.అనంతరం ఎఆరయస్ రతన్ టాటా ఫౌండేషన్ పేద తండ్రి లేని ముస్లిం విద్యార్థినికి గురుమూర్తి, గోపాలస్వామి,సతీష్ రెడ్డి ఆర్థిక సహాయము,పెన్నులు పుస్తకాలు మరియు దివ్యాంగుల అధ్యక్షులు ఇండ్ల ఓబులేశుకు డిశంబర్ లో జరుగు ప్రపంచ దివ్యాంగుల కార్యక్లమానికి ఆర్థిక సహాయము చేయడమైనది. చివరగా పర్యావరణ పరిరక్షకులు, సామాజిక సేవకులు,సీనియర్ బి.జె.పి నాయకులు పెద్దిరెడ్డి సతీష్ రెడ్డికి దుశ్శాలువా,రతన్ టాటా జ్ఞాపిక తో ఘనసన్మానం చేయడమైనది.ఈ కార్యక్రమంలో పూలే ఉత్సవ కమిటీ ఛేర్మెన్ యర్రగొల్ల గోపాలస్వామి,విగ్రహ నిర్మాణ కమిటి వైస్ ఛైర్మెన్ వజ్రాల వెంకటస్వామి,పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి, ఆవాజ్ అధ్యక్ష కార్యదర్శులు యస్.ఎ సత్తార్,అన్వర్



బాష,ఛాన్ భాష, పట్టణ అభివృద్ధి సొసైటి ఉపాధ్యక్షులు కె.వి సుబ్బారావు,గనుమంతు రాజేష్, శ్రీనివాసులు రెడ్డి,మరాఠా జాతీయ అధ్యక్షులు బి.యం.కె సాగర్,యస్.సి యస్.సి,యస్.టి మానిటరింగ్ కమిటి సభ్యులు నారాయణ, దళిత సంఘాల నాయకులు ఒ.యస్.వి ప్రసాద్, రామసుబ్బయ్య, పిచ్చయ్య, కేశవయ్య, వెంకటరమణ,బి.సి i సెల్ జిల్లా అధ్యక్షులు శివరాం,సుభాన్ బీ,దివ్యాంగుల అధ్యక్షులు ఓబులేశు తదితర ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.

# తడి-పొడి చెత్త వేర్వేరు చేసి ఇవ్వండి

## నగర ప్రజలకు కమిషనర్ పి.విశ్వనాథ్ సూచన





**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

నగర ప్రజలు తమ గృహాలు, వ్యాపార వాణిజ్య సముదాయాల్లో వెలువడే వ్యర్థాల్లో తడి%-%పొడి చెత్తా వేర్వేరు చేసి, నగరపాలక సిబ్బందికి ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం గార్గేయపురం డంప్‌యార్డును ఆయన సందర్శించారు. యంత్రాలు, వర్మికంపోస్టు పిట్స్, కంపోస్టు తయారీ యూనిట్, కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం, చెత్త వర్గీకరణ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా నెహ్రూ రోడ్డున బిటి రహదారి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రతిరోజు తడి పొడి చెత్తను వేరు చేసి డంపు యార్డులో చెత్తను తగ్గించాలని సూచించారు. శునకాలకు ఆహారం, శుభ్రత, వాతావరణం తగ్గట్టు పరిసరాలు వంటి చర్యల్లో నిర్లక్ష్యం చేయోద్దని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డంప్ యార్డుకు చేరుతున్న చెత్తలో పెద్ద మొత్తంలో మిశ్రమ వ్యర్థాలు ఉండడం కారణంగా రీసైక్లింగ్ వ్యవస్థపై భారం పెరుగుతోందని పేర్కొన్నారు. తడి చెత్త వ్యర్థాలతో కూడిన పదార్థాలుగా గుర్తించి రోజూ వేరు చేయాలని, పొడి చెత్తను ప్లాస్టిక్, పేపర్, గ్లాస్ వంటి రీసైక్లింగ్‌కు అనువైన వస్తువులుగా విడిగా ఇవ్వాలని సూచించారు. డంప్ యార్డు వద్ద పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు, ఇతర వస్తువులను డీఆర్‌సీసీకి తరలించాలన్నారు. తడి చెత్తను గార్గేయపురం డంప్ యార్డులో ఉన్న వర్మికంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చాలన్నారు. సెగ్రిగేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి డంపచ యార్డుకు వెళ్లే చెత్తను పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. నగరవ్యాప్తంగా ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను కార్మికులు తప్పకుండా సేకరించి వంద శాతం సెగ్రిగేషన్ చేయాలని ఆదేశించారు. మిశ్రమ చెత్త చేరితే యంత్రాలు పనిచేయడంలో ఇబ్బందులు రావడంతోపాటు పరిశుభ్రత వ్యవస్థ మొత్తం ప్రభావితం అవుతుందని ఆయన చెప్పారు. గృహాల దగ్గరే చెత్త వేరు చేయడం ద్వారా డంప్ యార్డులపై ఒత్తిడి తగ్గి, రీసైక్లింగ్ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. పరిశుభ్రమైన కర్నూలు నిర్మాణంలో ప్రతి పౌరుడూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తడి చెత్తా 8 టన్నులు వస్తుందని, మిశ్రమ చెత్తా 250 టన్నుల వరకు ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. గత నెల 20 నుండి ప్రారంభమైన మూడో విడత శునకాల సంతాన నిరోధక చికిత్సలు ఇప్పటికీ 550 అయ్యాయని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రమాదకరమైన వీధి శునకాలను గార్గేయపురం డంప్‌యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్&డి డిఈఈ ఫినిరాం, డిఈఈ క్రిష్ణలత, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో టిడిపి సమన్వయకర్తను కలిసిన మున్సిపల్ కార్మికులు

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కె.రితీష్ రెడ్డి హామీ



**బద్వేల్ నవంబర్ 28 (పల్లె వెలుగు )**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి గారికి వినతిపత్రం సమర్పించిన కార్మికులు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ బద్వేల్ పురపాలక సంఘంలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతూ ఇబ్బందులను ఎదుర్కొనుచున్నారని ప్రధానంగా పారిశుధ్యేతర పనులు నిర్వహిస్తున్న 15 మంది పారిశుద్ధ్య విభాగ కార్మికులను పారిశుద్ధ్య పనులకు కేటాయించాలని, రక్షణ పరికరాలు అయిన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, బట్టలు అందించాలని, గత 17 రోజుల సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, చెత్త తరలించు వాహనాల మరమ్మత్తులు పూర్తిస్థాయిలో చేయించి, ఇన్సూరెన్సులు రెన్యువల్ చేయాలని, వాహనాల మరమ్మత్తుల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, పెండింగ్ లో ఉన్న ఒక నెల హెల్త్ అలవెన్స్ మంజూరు చేయాలని, కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న మున్సిపల్ అధికారుల చర్యలను నివారించాలని, చనిపోయిన అదనపు కార్మికుని కుటుంబంలో ఉపాధి కల్పించాలని మరియు తదితర కార్మిక న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయనకు తెలియజేశారు. స్పందించిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కె.రితీష్ రెడ్డి గారు కార్మికుల సమస్యల పరిష్కారానికి గౌరవ కమిషనర్ గారితో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, యూనియన్ అధ్యక్ష -కార్యదర్శులు యన్. సత్యరాజు, కె.నాగేంద్రబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.హరి, ఉపాధ్యక్షులు డి.దేవమ్మ,యన్.పాలయ్య కార్యదర్శులు జి. శ్రీనివాసులు,బి.ప్రవీణ్ కుమార్, కోశాధికారి కె.శివ కుమార్ కమిటీ సభ్యులు టి.కిరణ్, కార్మికులు టి. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓంకారంలో అటవీశాఖ సిబ్బంది



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 28:** బండి ఆత్మకూరు మండల అటవీ శాఖ సిబ్బంది శుక్రవారం ఓంకారం పరిసర ప్రాంతాలకు చేరుకున్నారు. డిసెంబర్ 1 నుండి 8వ తేదీ వరకు అటవీ ప్రాంతంలో పులుల గణన జరుగుతుందని అటవీ శాఖ కన్సర్వేటర్ విజయకుమార్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా సెక్షన్‌ఆఫీసర్లు కాశీం నాయక్ నాగరాజు ప్రొటెక్షన్ వాచర్లు ఓంకారం నార్త్ బీట్లోని అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. నాగార్జునసాగర్ నేషనల్ టైగర్ ప్రాజెక్టు ట్రైనర్ శ్రీధర్ వీరికి పులుల గణన విషయంలో శిక్షణ ఇచ్చారు. ఉదయం ఆరు గంటల నుండి 10 గంటల వరకు పులులకు సంబంధించి గణన జరుగుతుందని తెలుస్తోంది. అటవీశాఖ సిబ్బంది మొత్తం పులుల గణన లో పాలుపంచుకుంటున్నారు.

## బద్వేల్ టౌన్ తెలుగు గంగ కాలనీలో నిర్వహించబడుతున్న శ్రీ సీతా, లక్ష్మణ, హనుమత్సమేత శ్రీరామచంద్రస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్టా మరియు కుంభాభిషేక మహోత్సవం ఎంతో భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిపారు



బద్వేల్ నవంబర్ 28 (పల్లె వెలుగు ):

ఈ మహోత్సవానికి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెద్దపోలిరెడ్డి పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మానంద రెడ్డి , అంకిరెడ్డి, కాలనీవాసుల ఆహ్వానం మేరకు.. ఎంపీ అవినాష్ రెడ్డి.. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ,.. ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ ..రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి , నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి గార్లు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. వేదపండితుల పవిత్ర మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణకుంభ స్వాగతం అందుకుని దేవాలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన నాయకులు, శ్రీరామ సంప్రదాయం ప్రకారం నిర్వహించిన ప్రతిష్టా హోమం, అభిషేకం వంటి పూజా కార్యక్రమాలలో భక్తి భావంతో పాల్గొన్నారు. అనంతరం పండితుల ఆశీర్వచనాలు స్వీకరించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని మరింత పుణ్యమయంగా మార్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పలు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచలంకు ప్రత్యేక బస్సు
### – ఆర్టీసీ డిఎం నిరంజన్



.పోరుమామిళ్ల,నవంబర్ 28( పల్లె వెలుగు):

కార్తీకదీపోత్సవం సందర్భంగా పోరుమామిళ్ల పట్టణం నుండి అరుణాచలంకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు బద్వేల్ ఆర్టీసీ డిఎం నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు డిసెంబర్ 3న పోరుమామిళ్ల బస్ స్టేషన్ నుంచి ఉదయం 6-00 గంటలకు బయలుదేరుతుందని, తిరుగు ప్రయాణం మరుసటి రోజు గురువారం అరుణాచలం నుంచి ఉదయం 10-00 గంటలకు బయలుదేరి పోరుమామిళ్లకు రాత్రి 8-00 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఇది బిఎస్ 6 సూపర్ లగ్జరీ బస్సు అని, పుష్ బ్యాక్ సీట్లతోబాటు ప్రతి సీటుకు మొబైల్ చార్జర్ ఉంటుందని అన్నారు. పోరుమామిళ్ల నుంచి రాను,పోను 1550 రూపాయలు ఛార్జి ఉంటుందని, రిజర్వేషన్ కోసం ఫోన్ పే నెంబర్ 7799305143 అని, వివరాలకోసం 9959225779 నెంబర్లో సంప్రదించాలని డి.ఎం తెలిపారు.

## ఒంటిమిట్ట మండలాన్ని డివిజన్‌గా ప్రకటించాలి

**ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలను కడప జిల్లాలో ఉంచాలి**

**జేఏసీ నాయకులు ఒంటిమిట్ట తాసిల్దార్ కు వినతి పత్రం**



ఒంటిమిట్ట పల్లి వెలుగు ప్రతినిధి:

కడప రెవెన్యూ డివిజన్ నుంచి ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలను రాజంపేట డివిజన్ కు మార్చుతూ ప్రభుత్వం తెలియజేయడంతో ఒంటిమిట్ట సిద్ధపటం మండలాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది కడపకు వెళ్లాలంటే 25 కిలోమీటర్లు మాత్రమే రాయచోటికి వెళ్లాలంటే 90 కిలోమీటర్ల వెళ్లాల్సి ఉంటుంది. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక గౌరవాన్ని పెంచుతుంది ప్రతి సంవత్సరం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు పౌర్ణమి కళ్యాణానికి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు రామయ్యకు ఇవ్వడం ఏకశిలా నగరం ఒంటిమిట్టకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏకశిలా నగరం ఒంటిమిట్ట దేవస్థానాన్ని అధికారిక రాష్ట్ర దేవాలయంగా ప్రకటించుకోవడానికి ఒంటిమిట్ట ప్రజలు చేపట్టిన శాంతియుత ఆందోళన సాధించిన గొప్ప విజయం. ఒంటిమిట్ట సిద్ధం మండలాల ప్రజలు ఏకమై ర్యాలీలు ధర్నాలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే ప్రభుత్వం ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముని దేవాలయం దృష్టిలో ఉంచుకుని తీరు మారి గతంలో ఉన్న ఒంటిమిట్ట సిద్ధం మండలాలను యధావిధిగా కొనసాగించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట చెరువు చైర్మన్ గంగిరెడ్డి. చెరువు వైస్ చైర్మన్ కట్టా యానాదయ్య. జేఏసీ నాయకులు రఘురాం రెడ్డి సుబ్బారెడ్డి. పాటయ్య. వెంకటేశు. బాలరాజు శివరాజు. తదితరులు. రవి. సుధాకర్ పాల్గొన్నారు.

# 136వ మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలోం

మహాత్మ జ్యోతిభాపూలే కు ఘన నివాళులు.

ఆదోనిలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహ నిర్మాణం పూర్తి చేసి జయంతి కార్యక్రమానికి విగ్రహావిష్కరణ జరపాలని డిమాండ్

బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మలిగే రామలింగయ్య

ఆదోని పల్లె వెలుగు నవంబర్ 28



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం లో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 136వ మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతికి ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మలిగే రామలింగయ్య కర్నూలు జిల్లా సలహాదారుడు కే శాంతరాజు పాల్గొని నివాళులర్పించారు. కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మలగే రామలింగయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చినటువంటి మాటని కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా పాటించాలని బహుజన సమాజ్ పార్టీగా మేము డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో బీసీలు మీకు రాబోయే సార్వత్రిక ఎన్నికలు బుద్ధి చెప్పి గద్దెని దింపుతారని హెచ్చరిక చేశారు. అదేవిధంగా బహుజన సమాజ్ పార్టీ తరుపున స్థానిక సంస్థలు ఎన్నికల్లో పోటీ చేయదలచిన వారు ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్, కౌన్సిలర్ గా ఉత్సాహవంతులు జిల్లా నాయకులను సంప్రదించినట్లయితే తప్పకుండా వారికి పార్టీ తరపున అన్ని విధాలుగా మద్దతు తెలిపి వారి యొక్క ప్రచారంలో అన్ని విధాలుగా సహాయసహకారం అందించి కరపత్రాలు విషయంలో నైతేనేమి, నామినేషన్ వేసే విషయంలో అయితేనేమి వారికి వెన్నుదండగా ఉంటూ వారిని ప్రోత్సహిస్తామని ఆయా మనవాద పార్టీలో పోటీ చేసి వాళ్ళకి బానిసలుగా బతకడం కంటే మీ యొక్క ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి ఈ పార్టీలో పోటీ చేసి మీ యొక్క స్థాయిని ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటారని ప్రతి ఒక్క బహుజన బిడ్డకు తెలియజేస్తున్నాను. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లైన ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలని బాబాసాహెబ్ అంబేద్కర్ గురువులైన బుద్ధుడు, కబీర్, మహాత్మ జ్యోతిబాపూలే లను స్మరిస్తూ ఈరోజు మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో ఆయనకు ఘన నివాళి అర్పించడం జరిగింది. అదేవిధంగా ఆదోనిలో నిర్మాణంలో ఉన్నటువంటి మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి జయంతి కార్యక్రమానికి అంతా ఏర్పాటు చేయాలని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని జయంతి రోజు తప్పకుండా పూర్తిచేసి విగ్రహావిష్కరణ జరపాలని బహుజన సమాజ్ పార్టీగా మేము ఆదోనిలో ఎవరైతే మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులుగా ఉన్నారో వాళ్లందర్నీ పేరుపేరునా కోరుకుంటూ ఉన్నాము. ఈరోజు ఉద్యోగాల్లో, పార్టీలలో, వ్యాపారాలలో స్థిరపడి ఉన్నామంటే దానంతటికీ మహా పురుషులు మహాత్మ జ్యోతిరావు పూలే యొక్క కృషి అని తెలియజేశారు. భారతదేశంలోనే బడుగు బలహీన వర్గాలను ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు మహాత్మ జ్యోతి రావు పూలే దేవుడి కన్నా ఎక్కువ అందుకే ఆయన విగ్రహ నిర్మాణంలో నిర్లక్ష్యం చేయకుండా,ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి ప్రజల్లో ఆ దేవుడు చేసిన సేవలను తెలియజేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో అక్బర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి.

బేతంచెర్ల నవంబర్ 28 పల్లె వెలుగు ప్రతినిధి:



2026 జనవరి 4వ తేదీ చలో విశాఖపట్నం కై కార్మిక వర్గం కదలి రావాలి. డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకువిశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభ లను జయప్రదం చేయాలని, అలాగే 2026 జనవరి 4వ తేదీ చలో విశాఖపట్నం కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కార్మిక వర్గం అధిక సంఖ్యలో తరలి రావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, సీనియర్ నాయకులు ఎస్ సాధిక్ హుస్సేన్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం నందు సిఐటియు ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, ఎస్ కాజా భాష ఆధ్వర్యంలో సి ఐ టి యు ఆల్ ఇండియా మహాసభల గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మిక వర్గాన్ని ఉక్కు పాదంతో అనగదొక్కడానికి పెద్ద పెద్ద కార్పొరేట్ పెట్టుబడిదారులతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుమ్మక్కై అడ్డదిడ్డమైన లేబర్ కోడ్లను అమలు చేయడం దారుణమని వారన్నారు. అధికారంలోకి రాక ముందర దేశంలో నిరుద్యోగాల్ని రూపుమాపేందుకు సంవత్సరానికి కోటి ఉద్యోగాలకు పైగా రిక్రూట్ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని మోసపూరితమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక ఉద్యోగులపై కుట్రపూరితమైన జీవోలను జారీ చేయడం సరైనది కాదని సరైనదివారన్నారు. మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇంకొక అడుగు ముందుకు వేసి కార్మిక హక్కులను కాలరాసే విధంగా 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 13 గంటల పని విధానాన్ని దేశంలోని ఏ రాష్ట్రం అమలు చేయకముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జీవోలను జారీ చేయడం చాలా దుర్మార్గమని వారి ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 31 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా సిఐటియు ఆల్ ఇండియా నాయకత్వం కార్మికుల శ్రేయస్సు కొరకు కార్మికుల హక్కుల కొరకు భవిష్యత్తు పోరాటాలకై తీసుకోబోతున్న నిర్ణయాలను ప్రణాళికలను సిద్ధం చేసుకుని ముందుకు సాగడానికై ఊరికో బండి ఇంటికో మనిషిగా జాతీయ మహాసభలకు తరలి రావాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి రాజు, రాజబాబు, రామచంద్రుడు, ఎస్ జాకీర్ భాష, గోర్లగుట్ట భాస్కర్, వెంకటేశ్వర్లు, రాజా, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని జిల్లా కోసం పోరాడదాం

### – విద్యార్థి సంఘాలు డిమాండ్

ఆదోని అర్బన్ పల్లె వెలుగు నవంబర్ 28



ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని అన్ని విద్యార్థుల నాయకులు కలిసి రావాలని శుక్రవారం పిడిఎస్ డిఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఆధ్వర్యంలోఆదోని లో ఎమ్మిగనూర్ సర్కిల్ నుండి భీమ సర్కిల్లో దీక్ష శిబిరం వరకు పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీగా వచ్చి ఆదోని జిల్లా కోసం సంఘీభావం తెలపడం జరిగింది రాష్ట్ర నాయకులు తిరుమలేష్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ మాట్లాడుతూ.ఆదోని ప్రజలను కేవలం ఓట్లు యంత్రాలగా చూస్తున్నారు ఒకప్పుడు ఆదోని కానీ ఇక్కడ ఉన్నటువంటి నాయకులు వల్ల ఆదోని జిల్లా చేయలేకపోయారు. ఇప్పటికైనా ఆదోని జిల్లా చేయకపోతే మరో 100 సంవత్సరాలు వెనక్కి పోతుంది .ఇప్పటికైనా ఆదోని జిల్లా చేసి ఇక్కడ ఉండే విద్య, వైద్యం, వలసలు, నిరుద్యోగం, ఇలాంటి చాలా సమస్యలను నిర్మూలించి అలాగే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఆదోని ఇక్కడ ప్రజలు వలసలు ఎక్కువగా పోతుంటారు. ఆదోని జిల్లా అయితే వలసలు,ప్రజలు సమస్యలు అరికట్టడం జరుగుతుంది . విద్యార్థులు ,ప్రజలకు కూడా ముందు రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది అలాగే కేంద్రం నుంచి వచ్చే ఫండ్స్ వలన పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఇవన్నీ 35 కిలోమీటర్లు లోపల ఉంటాయి కాబట్టి పరిపాలన సౌలభ్యం బాగా జరుగుతుంది వేల ఉద్యగాలు వస్తాయి ఆదోని జిల్లా చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం అని ఈ సందర్భంగా తెలపడం జరిగింది. ఆదోని జిల్లా వచ్చేంతవరకు ఆదోనిజిల్లా %జీూజ% కి చేయి కలుపుతూ పోరాడుదాం .కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆదోని కష్టాలను చూసి ఆదోని జిల్లా గా ప్రకటించాలని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ రాజేష్ డివిజన్ సెక్రెటరీ శివ ముఖ్య నాయకులు రాజు రంగస్వామి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ మరచిన అధికారులపై కలెక్టర్కు ఫిర్యాదు చేస్తాం.



**-వైఎస్ఆర్సీపి ఆర్టిఐ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొట్టాల రాజు.**

**ఆదోని పల్లె వెలుగు నవంబర్ 2**

ఆలూరు మండలం ములగవల్లి కొట్టాల గ్రామం లో గురువారం గోకులం షెడ్ నిర్మాణాలకు అధికార్లు ప్రోటోకాల్ లేకున్న టిడిపి నాయకులతో పూజలు చేయించి ఫ్లెక్సీ లో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఫోటో వేయకుండా అవమానించారని. ఈ విషయంపై ఆలూరు మండల అధికారులపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు వైసిపి సమాచార చట్ట విభాగం ఆర్ టి ఐ విభాగం జిల్లా యు ఉపాధ్యక్షులు కొట్టాల రాజు శుక్రవారం విలేఖర్లకు తెలిపారు. ఉపాధి హామీ పథకం శాఖ ద్వారా పల్లె పండుగ నిధులు కేటాయించి నిర్మిస్తున్న గోకులం షెడ్ నిర్మాణం కు సంబంధించిన ఫ్లెక్సీ లో సీఎం తో పాటూ జిల్లా లోని మంత్రులు,ఎంపీ తో పాటు ఫోటో క్రాల్ లేని వారి ఫోటోలు వేయడం అధికార్లకు సమంజసం కాదన్నారు. ఆలూరు శాసన సభ్యుడైన విరుపాక్షి నీ అధికార్లు విస్మరించడం సరి కాదన్నారు.

# రైతే రాష్ట్రానికి బలం.. కూటమి రైతు పక్షం..





**కోసిగి, నవంబర్ - 28 (పల్లెవెలుగు):** అన్నదాత సుఖీభవ - 5వ రోజుకోసిగి మండలం పల్లెపాడు గ్రామంలో మంత్రాలయం టిడిపి ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి రైతు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ?7,000 పొందిన రైతులు కూటమి ప్రభుత్వంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో మంత్రాలయం టిడిపి ఇన్చార్జి సోదరుడు గ్రామాన్ని సందర్శించి రైతులతో మా ప్రభుత్వం రైతన్నల కోసం మాటిచ్చింది%ొ% మాట నిలబెట్టుకుంది" అని ప్రజలకు వివరించారు. గతంలో నెలలు గడిచినా రాకపోయిన డబ్బులు ఇప్పుడు 24 గంటల్లో ఖాతాల్లో జమ అవుతున్నాయి అని రైతులు ప్రశంసించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో రైతుల జీవితం మారుతుందని,రైతు బలం ఉంటే గ్రామం బలం. అదే మా ప్రభుత్వ ధ్యేయం అని ఇన్చార్జి సోదరుడు మంత్రాలయం సొసైటీ చైర్మన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోసిగి మండలం నాయకులు ముత్తురెడ్డి, మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, ఎంపీడీవో, వ్యవసాయశాఖ అధికారి, రెవిన్యూ అధికారులు, ఎల్ఎల్సీ అధికారులు మరియు మండల మాజీ అధ్యక్షులు జ్ఞానేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సిరెడ్డి, సొసైటీ చైర్మన్ నాడిగినేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, వెంకటేష్ మరియు సాతనూరు కోసిగియ్య, హెళగుంద కోసిగియ్య, సంజీవయ్య ఈరన్న, మరియు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, రైతు సంఘాలు భారీగా పాల్గొన్నారు.



# విద్యార్థులు సైబర్ నేరాలు డ్రగ్స్ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి








**- మహిళల భద్రతకు శక్తి యాప్**

**వాట్సప్ సేవల పై విద్యార్దులకు పోలిసుల అవగాహన**


**కర్నూలు పల్లె వెలుగు క్రైమ్**

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు, డ్రగ్స్, సోషల్ మీడియా పై ప్రభావం , విద్యార్దులలో సామాజిక భాధ్యత , మహిళల భద్రతకు శక్తి యాప్ , వాట్సప్ సేవల పై పాఠశాలలు, కళాశాలల్లో వాటి సేవలను కర్నూలు పోలీసులు విద్యార్థీ , విద్యార్థినీలకు అవహాగాన చేస్తున్నారు.

ఈ సంధర్బంగా ఈ రోజు కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ మరియు కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజారావు, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ , ఎస్సై తిమ్మయ్య లు కలిసి కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలోని విద్యార్ధి, విద్యార్థినిలకు సైబర్ నేరాలు ,డ్రగ్స్, సోషల్ మీడియాపై ప్రభావం , విద్యార్దులలో సామాజిక భాధ్యత , పోక్సో చట్టాల పై అవగాహన కల్పించారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలలో కూడా శక్తి టీం బృందాలు పలు పాఠశాలల్లో విద్యార్థులకు డయల్ 112 , 100 , 1098 ,1930 , శక్తి యాప్, మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి " వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలని తెలియజేస్తున్నారు.

ఎక్కడైనా గంజాయి , డ్రగ్స్, మాదకద్రవ్యాల సేవించడం చూసినా విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలని సూచిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్ %ఛ% బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు , మహిళలపై జరిగే నేరాల పై అవగాహన కల్పిస్తున్నారు. 2025 జనవరి నుండి నవంబర్ 28 వ తేదీ వరకు శక్తి యాప్ ను జిల్లాలో 19,846 మంది డౌన్లోడ్ చేసుకున్నారు.

# వసతిగృహాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఇవ్వాలి.




**హాస్టల్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.**

**వసతిగృహాలలో ఎటువంటి సంఘటనలు జరిగినా కఠిన చర్యలు.**

**కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

వసతిగృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సోషల్ వెల్ఫేర్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వసతి గృహాలలో వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ....జిల్లాలోని అన్ని వసతి గృహాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులను వార్డెన్ లు తమ కన్నబిడ్డల్లా చూసుకోవాలని ఎటువంటి సంఘటనలు జరిగినా వసతి గృహాల సంక్షేమ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

జిల్లాలోని వసతి గృహాలకు 28 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లు మంజూరయ్యాయని ఇవన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంకా పాఠశాలలలో, వసతి గృహాలలో జరుగుతున్న భవన నిర్మాణ పనులు కాంపౌండ్ వాల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి అందుకు సంబంధించిన బిల్లులను ఆర్డబ్ల్యూఎస్ లాగిన్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఇకనుంచి హాస్టల్ లను తరచూ విజిట్ చేయడం జరుగుతుందని వసతి గృహాలలో విద్యార్థుల నుంచి ఎటువంటి అసంతృప్తి తలెత్తకుండా వార్డెన్లు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తున్న ఎర్రవల్లి గ్రామం.



**చారకొండ, నవంబర్ 28 పల్లె వెలుగు దినపత్రిక :** ఎర్రవల్లి గ్రామంలో నాని కదా సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించాలని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సమావేషమైన వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. నిర్మించనున్న ఎర్రవల్లి గోకారం రిజర్వాయర్లో ముంపునకు మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి విన్నవించిన విషయం తెలిసిందే. భూ నిర్వాసితులకు న్యాయం చేయనందున గ్రామ ప్రజలందరూ ఏకమై స్థానిక సర్పంచ్ ఎలక్షన్లలో బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, యువకులు, మాజీ ప్రజా ప్రతినిధులు , మహిళలు పాల్గొన్నారు.

## సీఎం సొంతూరిలో సర్పంచ్ స్థానం ఏకగ్రీవం.!

**వంగూరు నవంబర్ 28 పల్లె వెలుగు దినపత్రిక:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సొంత గ్రామం నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డి పల్లి లో సర్పంచ్ వస్తాను ఏకగ్రీవమైనట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత పల్లెల్లో సందడి వాతావరణ నెలకొంది. 11 ,14 ,17 తేదీలలో మూడు విడుదల ఎన్నికల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో ఆశావాహులు ఏకగ్రీవాలపై దృష్టి సారించారు.



గ్రామస్తులను ఒప్పించేందుకు వివిధ హామీలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలోనే సొంతూరు సర్పంచ్ స్థానం ఎస్సి కి రిజర్వుడు అయింది. స్వీకరణ ప్రక్రియ ప్రారంభించినా ఇక్కడ ఇప్పటివరకు నామినేషన్లు నమోదు కాలేదు. అభివృద్ధి కోసం ఏకగ్రీవం చేయాలనే ఉద్దేశంతో గ్రామస్తులు ఎవరు కూడా నామినేషన్ వేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో కొండారెడ్డిపల్లి లో సర్పంచ్ స్థానం ఏకగ్రీవం అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి .

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు.



**వెల్దండ నవంబర్ 28 పల్లె వెలుగు దినపత్రిక:** వెల్దండ మండలంలో కాంగ్రెస్ పార్టీలో కి బీఆర్ఎస్ పార్టీ నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వెల్దండ మండల కేంద్రానికి చెందిన గంగ రాతి శ్రీను, గంగ రాతి శేఖర్, సింగరాజు మస్తాన్, పుట్ట శ్రీకాంత్ పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో అన్ని సర్పంచ్ స్థానాల్లో విజయం సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కమిటీ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, భూపతి రెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, ఎర్ర శ్రీను, పురుషోత్తం చారి, అర్జున్ గౌడ్, రషీద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియ



**వెల్దండ నవంబర్ 28 పల్లె వెలుగు దినపత్రిక:** వెల్దండ మండలంలోని 32 గ్రామ పంచాయతీల సర్పంచ్ లకు, 270 వార్డు సభ్యులకు రెండవరోజు మొత్తం 30 సర్పంచ్ స్థానాలు, 93 వార్డ్ సభ్యుల స్థానాలు మొత్తం 123 నామినేషన్లు దాఖలు అయినట్టు ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులు బొల్లంపల్లిలో బుడ్డం వెంకటయ్య , పోతేపల్లిలో తగుళ్ల కొండలు యాదవ్, అల్లం తోట బావి తండాలో రాత్లావత్ జ్యోతి సుధీర్ నాయక్, బండోని పల్లిలో ఎనుముల శేఖర్ రెడ్డి, బొల్లంపల్లి వార్డు స్థానాలకు గాను కొమ్ము రవి, సత్తూరి శేఖర్, ఇలా వివిధ గ్రామాల్లో నామినేషన్లు వేయడం జరిగింది.

## భారత రాజ్యాంగ దినోత్సవం, సందర్భంగా,.. అసెంబ్లీలో నిర్వహించిన బాలల శాసనసభలో







**ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 28** ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా వ్యవహరించిన 9వ తరగతి విద్యార్థిని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అభినందించారు. ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన నవనీత్ కుమార్తో పాఠశాల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి ప్రశంసించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గౌరమ్మ ఉపాధ్యాయులు మార్కెట్ యాడ్ చైర్మన్ కురవ మల్లయ్య, నందవరం మండల కన్వీనర్ ఖాసిం వలి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల మీద సస్పెన్షన్ ఎత్తివేయాలి.

**అర్ధరాత్రి ఫోన్ చేసి బెదిరించిన ఏఐఎస్ఎఫ్ శరత్ పై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలి.**

**ఆర్ యు రిజిస్ట్రార్ కు వినతి పత్రం అందజేసిన బాధిత విద్యార్థి శివ గణేష్ నాయక్**

**రాయలసీమ ఉద్యమ యువ నాయకులు సీమ కృష్ణ రాథోడ్.**



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆర్ యు రిజిస్టర్ విజయ్ కుమార్ నాయుడు కు బాధిత విద్యార్థి శివ గణేష్ నాయక్ మరియు రాయలసీమ ఉద్యమ యువ నాయకులు,రాయలసీమ విద్యార్థి సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు సీమ కృష్ణ రాథోడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిపాలన భవనం ఎదురుగా వారు మాట్లాడుతూ బీకాం మొదటి సంవత్సరం మరియు బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల మధ్య జరిగిన చిన్న ఘర్షణను ఏఐఎస్ఎఫ్ శరత్ ర్యాగింగ్ మరియు సిగరెట్ల తో కాల్చాడని పక్కదారి పట్టించాడు. అతనికి సంబంధంలేని ఈ ఘటనలో తల దూర్చడమే కాకుండా బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న శివ గణేష్ నాయక్ ను చెడుగా ప్రచారం చేస్తూ అతనిని హాస్టల్ నుంచి మరి రాయలసీమ యూనివర్సిటీ తొలగించాలని కమిటీలో ఉన్న వారిని ఒత్తిడికి గురి చేశాడు. అయితే అధికారులు ఇద్దరినీ మాత్రమే సస్పెన్షన్ చేసి మరొక విద్యార్థిపై చర్యలు తీసుకోలేదు. సిగరెట్ తో కాల్చాడని చెప్పిన హరీష్ అనే విద్యార్థి ఈ ఘటనలో విచారణ చేసిన కమిటీలో సీక్రెట్ తో కాల్చలేదని తనపై చెంప మీద కొట్టడం జరిగిందని తెలపడం జరిగింది.ఈ ఘటనలో తప్పుడుగా ప్రచారం చేసిన ఏఐఎస్ఎఫ్ శరత్ కుమార్ ను చర్యలు తీసుకొని యూనివర్సిటీ నుంచి తొలగించాలని కోరుతున్నామని, విద్యార్థుల జీవితాలు నాశనం కాకుండా సస్పెన్షన్ ఎత్తివేయాలని వారు తెలిపారు.

## రైతన్న..మీకోసం... అన్నదాత సుఖీభవ గురించి అవగాహన



**మండల టిడిపి నాయకులు.,,,,,**

**నందవరం పల్లె వెలుగు నవంబర్ 28**

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరం మండల పరిధిలోని స్థానిక నాగలదిన్నె గ్రామంలో మరియు కనకవీడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ మండల టిడిపి కన్వీనర్ కాసి%శీ%వాలి సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపాల్ ఎమ్మిగనూరు మార్కెట్ చైర్మన్ మల్లయ్య కనకవీడు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 'రైతన్నా.మీ కోసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్లకు నేరుగా వెళ్లి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు 'పంచసూత్రాల' అమలు ద్వారా కలిగే లాభాలను వివరించనున్నారు. రైతులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ విధానాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయం, అనుబంధ శాఖలు, మార్కెటింగ్ అధికారులు, సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచసూత్రాలు %-% నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అమలుపై లోతైన చర్చ జరిగింది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది ముందుండి ఈ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయాలని సీఎం ఆదేశించారు.సీఎం మాట్లాడుతూ గత 17 నెలలుగా రైతులు, వ్యవసాయాన్ని ముందుకు తీసుకొచ్చాం. 'అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్' కింద 46.50 లక్షల మంది రైతులకు రూ.14 వేల చొప్పున జమ చేశాం. బిందు సేద్యం, పొలం పిలుస్తోంది కార్యక్రమాలతోపాటు ఇప్పుడు పంచసూత్రాలతో రైతులకు మరింత మేలు చేకూరుస్తున్నాం. పాడి, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, ఆక్వా, ఉద్యానవన, సెరికల్చర్ రంగాల రైతులకు కూడా ఈ అవగాహన అందాలి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, భూసార రక్షణతోపాటు ఆరోగ్యాన్ని కాపాడాలి. రైతు బజార్లలో ప్రకృతి ఉత్పత్తులకు ప్రత్యేక స్థానం కల్పించాలి" అని పేర్కొన్నారు.పురుగుమందుల అధిక వినియోగం నష్టాలు, సేంద్రీయ విధానం ద్వారా విదేశీ మార్కెట్లలో డిమాండ్, భూసార





పరీక్షలు, సమర్థ నీటి నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి అంశాలను రైతులకు ఇంటింటా వివరించాలని సీఎం ఆదేశించారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి, రైతుల సమస్యలు నేరుగా తెలుసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. మండల క్లస్టర్ ఇంచార్జి వన్ వీరేష్ సత్తిరెడ్డి. మరియు నాగలదిన్నె గ్రామ టిడిపి నాయకులు మరియు కనకవీడు గ్రామ టిడిపి నాయకులు డీలర్లు కురవ మునుస్వామి, నరసింహులు, దుబ్బన్న, మోజేష్, హనుమంతు, పేట సామ్యూల్, రాముడు, మాన్దొడ్డి ఈరన్న, లక్ష్మన్న, జీవన్ ,అశోక్, క్రిస్టఫర్, ఆదాము, కె ఈరన్న, కాజా హుస్సేని ,శివ, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు

## పిఆర్‌టియు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది

**రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వై వి రమణయ్య**







**ఆళ్లగడ్డ (ఉయ్యాలవాడ ) నవంబర్ 28 పల్లె వెలుగు** పి ఆర్ టి యు ఉయ్యాలవాడ మండలం మండల అధ్యక్షుడు ఏ రవికుమార్ శర్మ ప్రధాన కార్యదర్శి ఆదాం ఆధ్వర్యంలో మండలపి ఆర్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూటెట్ నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పిఆర్సి కమిషనర్ ఏర్పాటు చేయాలని 30% మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చెయ్యాలన్నారు. పి ఆర్ టి యు ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైవి రమణయ్య తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైవి రమణయ్య సీనియర్ నాయకులు నాగేశ్వరరావు పోచ శ్రీనివాస్ రెడ్డి, దస్తగిరి లక్ష్మణరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం




బేతంచర్ల పట్టణంలోని సీపీఐ కార్యాలయం నందు సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేశ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ హాజరై మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రం, నంద్యాల పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ అయిన తాళ్లపల్లె వీరయ్య 2019 సంవత్సరంలో మరణించారని, ఆయనకు చెందిన ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో ఫేక్ దస్తావేజులు సృష్టించాడన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నా, స్టేటస్ కో ఉన్న ఆస్తిని తన అధికార పలుకుబడిని ఉపయోగించి, మున్సిపల్ అధికారులతో అప్రూవల్ చేయించుకొని రిజిస్టర్లు చేసుకోవడం జరిగిందన్నారు తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమాలకు పాల్పడుతున్న బిల్డర్ పబ్బతి వేణు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిరంతరం ప్రజల కోసం పనిచేసే సీపీఐ నాయకులపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు, కమ్యూనిస్టుల గురించి మాట్లాడేటప్పుడు నోరు, అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు... పబ్బతి వేణు అక్రమాలను సాక్షాధారాలతో నిరూపిస్తామన్నారు. ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన తాళ్లపల్లి వీరయ్య కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులను ఫోర్జరీ సంతకాలతో ఆక్రమించి, చట్టాన్ని అతిక్రమిస్తూ అపార్ట్మెంట్లను నిర్మిస్తున్నా పబ్బతి వేణు అక్రమాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నారు, తాళ్లపల్లి వీరయ్య కుటుంబానికి జరిగిన అన్యాయం మీద పబ్బతి వేణును ప్రశ్నిస్తే అబద్ధం నిజమవుతుందా అని ప్రశ్నించారు, తన అవినీతిని ఎక్కడ బయట పెడతారో అని, ఆయనకు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆరోపించారు, నంద్యాలలో మచ్చలేని వ్యక్తిగా ఉన్న న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ ఇలాంటి వ్యక్తులను పక్కన పెట్టుకుంటే అవినీతి మరకలు వారికి అంటుతాయని, ఇలాంటి వారిని పక్కన పెట్టాలన్నారు. పబ్బతి వేణు చేసిన అసత్య ఆరోపణలకు సీపీఐ నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి డి దస్తగిరి, బాలు, ఖదీర్ మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదకర లైట్స్ లను తొలగించాలి..



**కోసిగి, నవంబర్ - 28 (పల్లె వెలుగు):** మండల కేంద్రంలోని కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఒకే ఒక మెరుస్తున్న లైట్ ఉన్న వాహనాల్లో ఎప్పుడూ ప్రయాణించకండి. ఇది చిన్న విషయం అనిపించినప్పటికీ, రోడ్డు భద్రత పరంగా ఇది చాలా ప్రమాదకరం మారుతుంది. సాధారణంగా వాహనాల్లో రెండు హెడ్‌లైట్లు ఉండడం వల్ల వాహనం ఏ దిశలో వస్తోంది అనే విషయం ఇతర డ్రైవర్లు సులభంగా గుర్తించగలరు. అయితే ఒక లైట్ పనిచేయకపోతే, వాహనం స్పష్టంగా కనిపించకపోవడం? కాకుండా, ఎదురుగా వస్తున్న వాహనం బైక్ అని, కార్ అని, ఎంత దూరంలో ఉందని అంచనా వేయడం కూడా చాలా కష్టమవుతుంది. ఇదే ప్రధాన ప్రమాదానికి కారణమవుతుంది. ఇలాంటి పరిస్థితులు ముఖ్యంగా రాత్రి సమయంలో, భారీ వర్షం పడుతున్నప్పుడు, పొగమంచు ఉన్నప్పుడో లేదా హైవేలపై వేగంగా ప్రయాణిస్తున్నప్పుడు మరింత ప్రమాదకరంగా మారతాయి. ఒకే లైట్ ఉన్న వాహనం ఎదురుగా వస్తే, ఇతర డ్రైవర్లు దాని దిశ, వేగం సరిగ్గా అర్థం చేసుకోకపోవచ్చు. దీంతో తప్పుడు అంచనాలు, అజాగ్రత్త మలుపులు, ఢీకొనుట వంటి తీవ్రమైన ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ గా ఉంటుంది. ఒక లైట్ పని చేయకపోవడం వాహనంలో ఎలక్ట్రిక్ సిస్టంలో లోపం ఉండొచ్చని సూచించవచ్చు. ఇది ఇతర భాగాలకు కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల, మీరు ప్రయాణించే వాహనంలో రెండు హెడ్‌లైట్లు, బ్రేక్ లైట్లు, ఇండికేటర్లు సరిగా పనిచేస్తున్నాయా అని తప్పనిసరిగా తనిఖీ చేయండి. మీరు ప్రయాణించే వాహనం సరిగా కనిపించకపోతే, అది మీ ప్రాణాలకు మాత్రమే కాదు, రోడ్డుపై ఉన్న ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమే. కాబట్టి ఎప్పుడూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి. పూర్తిగా పనిచేసే లైట్లు మరియు భద్రతా ప్రమాణాలు పాటించే వాహనాల్లోనే ప్రయాణించండి. మీ జాగ్రత్తలే మీకు మరియు మీతో ప్రయాణిస్తున్న వారికి రక్షణ కవచం అని ఆయన అన్నారు.

# ఏపీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆయన వెంటనే ఆమోదం తెలుపుతారు



### – కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

### – అమరావతి పునఃప్రారంభంపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ హర్షం

### – రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన


### – రైతుల త్యాగాన్ని మరువొద్దని, వారికి బ్యాంకులు అండగా నిలవాలని పిలుపు

### – ఏపీకి ప్రధాని మోదీ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం

### – రాష్ట్రంలో ఏఐ, క్వాంటం వ్యాలీ, ఆస్ట్రో ఫిజిక్స్ ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడం సంతోషకరమని, ఇది ఒక యజ్ఞం లాంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో ఒక కొత్త రాజధాని నగరాన్ని నిర్మించడం సామాన్య విషయం కాదని, ఈ బృహత్కార్యానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో 15 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగించారు. భవిష్యత్ రాజధానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలు (పీఎస్‌యూ) తమ ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఒకేచోట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 15 బ్యాంకులు, బీమా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులను ఎన్నటికీ మర్చిపోకూడదని, వారి ప్రయోజనాలను కాపాడటం బ్యాంకుల బాధ్యత అని గుర్తుచేశారు. బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ వంటి సౌకర్యాలు కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమలోని 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో గత పదేళ్లలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటకు తీసుకువచ్చామని, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయని నిర్మల వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా బ్యాంకులు భవిష్యత్ ఆలోచనలతో, సమీకృత ఐడియాలతో పనిచేయాలని సూచించారు. గతంలో 'మహిళా సఖి' పేరుతో మహిళలను బీమా ఏజెంట్లుగా మార్చే కార్యక్రమం అద్భుత ఫలితాలు ఇచ్చిందని గుర్తుచేశారు. విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అండగా నిలవాలని ప్రధాని మోదీ ఎప్పుడూ చెబుతుంటారని, ఏపీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆయన తక్షణమే ఆమోదం తెలుపుతారని అన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేవలం ఐటీ మాత్రమే కాకుండా, ఆస్ట్రో ఫిజిక్స్ వంటి రంగాల్లోనూ ఏపీని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఆచార్య నాగార్జునుడు వంటి గొప్ప శాస్త్రవేత్తలు నడయాడిన ఈ గడ్డపై, అమరావతిలో ఒక కాస్మోస్ ప్లానెటోరియం నిర్మిస్తుండడం హర్షణీయమని అన్నారు. రానున్న ఏడాదిన్నర కాలంలో ఆంధ్రప్రదేశ్ ఒక ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరంగా రూపుదిద్దుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రేర్ ఎర్త్ మినరల్స్‌పై కీలక నిర్ణయం తీసుకుందని, ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవ డానికి కూడా ఏపీ కృషి చేయాలని నిర్మలా సీతారామన్ కోరారు.



# తీవ్ర రూపం దాల్చిన దిత్వా తుపాను...

## ఏపీలో అత్యంత భారీ వర్షాలు

**నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న 'దిత్వా' తుపాను**

**తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్రకు అతి భారీ వర్షాల హెచ్చరిక**

**ఆదివారం నాటికి ఏపీ-తమిళనాడు తీరానికి చేరువయ్యే అవకాశం**

**గంటకు 90 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా**

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని అధికార యంత్రాంగం ఆదేశాలు**

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను తీవ్రరూపం దాల్చింది. ఇది శ్రీలంక తీర ప్రాంతం మీదుగా పయనిస్తూ మరింత బలపడింది. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాలతో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో 'అత్యంత భారీ వర్షాలు' కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ తుపాను వాయవ్య దిశగా కదులుతూ, బంగాళాఖాతంలో కారైకాల్‌కు ఆగ్నేయంగా 320 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు ధృవీకరించారు. ఈ తుపాను ఆదివారం ఉదయానికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు అత్యంత సమీపంగా రానుందని ఐఎండీ అంచనా వేసింది. "శు క్రవారం నుంచి మూడు రోజుల పాటు తమిళనాడు తీరంలో అక్కడక్కడా కుండపోతగా అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలి" అని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (%=వీజ%) సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యంగా ఆదివారం దక్షిణ కోస్తాంధ్ర, తీర ప్రాంత రాయలసీమలోనూ అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 70-80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, కొన్నిసార్లు వీటి వేగం గంటకు 90 కిలోమీటర్లకు చేరుకోవచ్చని హెచ్చరించింది. సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉంటుందని, అలలు ఎగిసిపడతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లడాన్ని పూర్తిగా నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# ఏపీ ఉద్యోగుల ఈహెచ్‌ఎస్ కష్టాలకు చెక్.. ప్రభుత్వం కీలక ముందడుగు

**ఈహెచ్‌ఎస్ సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం చర్యలు**

**ఏడుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు**

**అమరావతి**

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పథకం అమలులో ఉన్న దీర్ఘకాలిక లోపాలను సరిదిద్దేందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఏడుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 8 వారాల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలోని ఈ కమిటీలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యయ విభాగం కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈవోతో పాటు ఇద్దరు ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు చోటు కల్పించారు. గత నెలలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈహెచ్‌ఎస్ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు తాజాగా కమిటీ ఏర్పాటైంది. ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడంపై ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్, ఏపీఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శి డీవీ రమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ కమిటీ నిర్దేశిత గడువులోగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వైద్య బిల్లుల ఆమోదంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, జిల్లాల్లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ. 50 వేల నుంచి లక్షకు పెంచాలని వారు కోరారు. అలాగే, వైద్యసేవల పరిమితిని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పైగా పెంచాలని, పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగులకు కూడా ఆరోగ్య కార్డులు అందించాలని విజ్ఞప్తి చేశారు. 2013లో ప్రారంభమైన ఈహెచ్‌ఎస్ పథకం ద్వారా రాష్ట్రంలో సుమారు 24 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. అయితే, ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, పాత ప్యాకేజీ ధరల కారణంగా నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలు అందించడానికి విముఖత చూపుతున్నాయని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ సమస్యలన్నింటికీ కమిటీ నివేదికతో పరిష్కారం లభిస్తుందని ఉద్యోగులు ఆశిస్తున్నారు.

## సిసిఐ నిబంధనల మార్పు

- రాష్ట్ర విజ్ఞప్తిపై స్పందించని కేంద్రం

**గుంటూరు,నవంబర్28:** పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలు సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఇప్పటి వరకు సానుకూల స్పందన రాలేదు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో రైతులకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చిలోనే మిర్చి రైతులకు సాయం అందిస్తామని చెప్పిన కేంద్రం ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. ధరలు తగ్గి ఒక్కో రైతు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. కానీ, ఇటీవల గుంటూరు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాత్రం రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకున్నామని గొప్పగా ప్రకటించారు. తాజాగా, రాష్ట్రంలో 11 మార్కెట్ కమిటీల పరిధిలో 64 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను సిసిఐ ప్రారంభించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు ఎనిమిది లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. సిసిఐ ద్వారా ఇప్పటి వరకు నాలుగు వేల మంది రైతుల నుంచి 90 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తిని కొనుగోలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, సిసిఐ నిబంధనల సడలింపునకు కేంద్రంతో చర్చలు వేగవంతం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న యాప్ విధానం మార్చాలని, 12 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని కోరామని మంత్రి ప్రకటించినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదు.

## సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం

- జనవరి 1న ఆయుధాలు వదిలి వస్తాం
- ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ


రాయపూర్,నవంబర్28: మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర-మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.

## టెక్నాలజీతో పౌల్ట్రీకి లాభాలు

- రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే గుడ్లు, చికెన్ ఉత్పత్తిలో తొలిస్థానం
- పౌల్ట్రీ ఇండియా-2025 ముగింపు సభలో అధ్యక్షుడు ఉదయ్‌సింగ్

**హైదరాబాద్, నవంబర్ :** యువత పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్న పౌల్ట్రీ రంగం భవిష్యత్తులో ఉజ్వల భవిష్యత్తు ఉందనే పరిస్థితులు నెలకొన్నాయని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధి రంగంగా విస్తరిస్తున్న పౌల్ట్రీ రంగంలోకి కొత్తగా వచ్చే యువత ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఈ రంగంలో అధిక లాభాలు పొందవచ్చని హైదరాబాద్ హెచ్ఐసీసీ కేంద్రంగా నిర్వహించిన పౌల్ట్రీ ఇండియా-2025 ఎక్స్‌పో ముగింపు కార్యక్రమంలో ఆయన అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించిందని, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎగ్జిబిషన్‌లో 5 ఎగ్జిబిటర్లు, 50 వేల మంది సందర్శకులు పాల్గొన్నారని చెప్పారు. ఈ ఎక్స్‌పో నిర్వహణకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉదయ్‌సింగ్ బయాస్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో పౌల్ట్రీ పరిశ్రమ విస్తరణకు మంచి అవకాశాలున్నప్పటికీ, హెచ్ఎండీఏ నిబంధనలతో ఈ రంగంలోకి వచ్చేవారిపై పెనుభారంగా మారిందన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా కోళ్ల ఫాం పెట్టడానికి పెట్టిన 40 ఫీట్ల రోడ్డు నిబంధనను ఎత్తివేసి, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర మాదిరిగా వ్యవసాయ అనుబంధ రంగంగా పౌల్ట్రీ పరిశ్రమను గుర్తించి, వ్యవసాయానికి వర్తింప చేసే విద్యుత్ టారిఫ్‌ను అందించాలని ఉదయ్‌సింగ్ బయాస్ విజ్ఞప్తి చేశారు. ఈ నిబంధనలపై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలుసుకొని తమ ఇబ్బందులను వెల్లడించనున్నట్లు ఆయన చెప్పారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పౌల్ట్రీ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం అందిస్తే రాబోయే కొద్ది రోజుల్లోనే దేశంలో తెలంగాణ రాష్ట్రం చికెన్, గుడ్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలుస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. అంతకుముందు బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె లక్ష్మణ్ మాట్లాడుతూ.. గుడ్డు వినియోగంలో కేంద్రం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, మాల్ న్యూట్రిషన్ విషయంలో గుడ్డు వినియోగం అవసరాన్ని గుర్తించి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పేరుతో అనేక సబ్సిడీ కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పౌల్ట్రీ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకున్నప్పుడే ఈ రంగం మరింత పురోభివృద్ధి సాధించనుందని పేర్కొన్నారు.

## దూసుకెళ్తున్న బంగారం, వెండి



న్యూఢిల్లీ, నవంబర్: బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. శుక్రవారం ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.700 పుంజుకొని రూ.1,30,160గా నమోదైంది. ఇక కిలో వెండి రేటు రూ.3,000 ఎగబాకి రూ.1,71, 200గా ఉన్నది. దీంతో ఆల్‌టైమ్ హై రికార్డులకు మళ్లీ చేరువైనెట్టింది. అక్టోబర్ 17న తులం పసిడి మునుపెన్నడూ లేనివిధంగా ఏకంగా రూ.1,34,800 పలికిన విషయం తెలిసిందే. అలాగే అక్టోబర్ 14న కిలో వెండి రూ.1,85,000కు చేరింది. ఆ తర్వాత తగ్గుముఖం పట్టినా తిరిగి ఎగిశాయి.

హైదరాబాద్‌లో..

24 క్యారెట్ బంగారం తులం రూ.710 పెరిగి రూ.1,28,460గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.650 అందుకుని రూ.1,17,750 పలికింది. ఇక అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్స్ గోల్డ్ 12.44 డాలర్లు పుంజుకొని 4,169.88 డాలర్లకు చేరింది. వెండి కూడా 53.81 డాలర్లుగా నమోదైంది. కాగా, గ్లోబల్ మార్కెట్ ట్రెండ్, మదుపరుల నుంచి వస్తున్న డిమాండ్‌తోనే ధరలు పెరుగుతున్నాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నది. అలాగే వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న అంచనాలూ ఉన్నాయి. ఇవి కూడా గోల్డ్ రేట్లను ఎగదోస్తున్నాయి. కాగా, అంతర్జాతీయ బంగారం మార్కెట్‌లో భారత్ ధరలను అనుసరించడానికి బదులుగా ధరలను నిర్ణయించే స్థాయికి వెళ్తుందని, దేశీయంగా గోల్డ్ మైనింగ్ పెరిగితే ఇది సాధ్యమేనన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

# పత్తి రైతులపై నిబంధనల కత్తి !



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నామన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి.అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. అరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు.. ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల పక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవే టు వ్యాపారులే గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళ్లు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది. ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్ తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండించే రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేశీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.

## ఢిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం

- అల్-ఫలా విశ్వవిద్యాలయానికి డాక్టర్ షాహిన్
- సీన్ రిక్రియేషన్‌తో మూలాలు గుర్తిచే యత్నం


**న్యూఢిల్లీ,నవంబర్28 :** ఢిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తును విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్ ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. యూనివర్సిటీలో ఎవరైనా ఉగ్ర మద్దతుదారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. వారిని గుర్తించడానికి నిఘా వర్గాలు పని చేస్తున్నాయన్నారు. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు.

## థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసల నిషేధం

- అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక ప్రకటన

**వాషింగ్టన్,నవంబర్28 :** అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాల నుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్స్‌ను కూడా నిలివేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికా సాంకేతికంగా ముందుకెళ్తున్నప్పటికీ.. మన ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను, చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. జో బైడెన్ ఆటోపెన్‌తో సంతకం చేసిన లక్షల మంది అక్రమ అడ్మిషన్లను రద్దు చేయనున్నట్లు తెలిపారు. అమెరికాకు ఆస్తి కాని లేదా మన దేశాన్ని ప్రేమించని వ్యక్తులను ఇక్కడి నుంచి పంపించేస్తాం. అమెరికాయేతర పౌరులందరికీ ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తాం అని అన్నారు. దేశ ప్రశాంతతకు భంగం కలిగించే, మన భద్రతకు ముప్పుగా మారే వారిని బహిష్కరిస్తాం. తిరోగమన వలస విధానంతోనే ఈ లక్ష్యాలను సాధించగలం అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. శ్వేత సౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం అమెరికా కాలమానం ప్రకారం కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నేషనల్ గార్డ్‌కు చెందిన ఓ సభ్యురాలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. నిందితుడిని అప్ఘాన్‌కు చెందిన రెహ్మానుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. సీఐఏ మద్దతు ఉన్న అప్ఘాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ వలసలపై తాజా నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్స్‌ను అధికారులు సమీక్షించనున్నారు. పేద, అభివృద్ధి అంతగా లేని దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పిలిచేవారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని అనేక దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని తక్కువ ఆదాయం కలిగిన దేశాలుగా పేర్కొంటున్నారు. దక్షిణ సూడాన్, సోమాలియా, నైగర్, బుర్కినా ఫాసో, బురుండి, అఎ÷-గానిస్థాన్, మడగాస్కర్, ఇథియోపియా, లైబీరియా, పాకిస్థాన్, సిరియా, ఉగాండా వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. దీంతో ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్న వారిని వెనక్కి పంపడం ఖాయమని తెలుస్తోంది


# మీ అభిమానాలే నన్నునిలబెట్టాయి: నవీన్




టాలీవుడ్‌లో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన 'జాతిరత్నాలు'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా 'అనగనగా ఒక రాజు'ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు. దీర్ఘ విరామం తరువాత ఈ సినిమాను పూర్తిచేసిన నవీన్ ఇప్పుడు సంక్రాంతి 2026 కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ 'అనగనగా ఒక రాజు' ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. నాది సైలెంట్ బ్యాచ్ కాదు.. అల్లరి చేసే బ్యాచ్. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మీ అందరి సపోర్ట్ వల్లే. ఏజెంట్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి సినిమాలను మీరు ఎంత ప్రేమించారో తెలుసు. ఈ సినిమాను కూడా అదే ప్రేమతో ఆదరిస్తారని నమ్మకం ఉందన్నాడు. ఈ సినిమాలో పాట పాడాను, డ్యాన్స్ చేశాను? ఈ సారి పండగకి మీ ముందుకు రానున్నాను' అని అన్నారు. నవీన్ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు 'అనగనగా ఒక రాజు'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రమాదాన్ని జయించి, ప్రేక్షకుల ముందుకు వస్తున్న నవీన్ ప్రయాణం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## గందరగోళంగా విష్ణు విశాల్ ఆర్యన్

తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన కథానాయకుడు విష్ణు విశాల్ కీలక పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఓ న్యూస్ ఛానల్‌లో జరుగుతున్న ఇంటర్వ్యూకు ప్రేక్షకుడిలా హాజరవుతాడు ఆత్రేయ (సెల్వ రాఘవన్). నయన (శ్రద్ధా శ్రీనాథ్) వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఆ షోకు వచ్చిన సెలబ్రిటీని కాలిపై తుపాకీతో కాల్చి లైవ్‌లో యావత్ ప్రపంచానికి ఓ సందేశాన్ని ఇస్తాడు. తాను ఒక రచయితనని, జీవితంలో ఫెయిల్ అయినట్లు చెబుతాడు. వచ్చే ఐదు రోజుల్లో ఐదు హత్యలు చేస్తానని.. గంట ముందు వారి పేరు చెబుతానని, ఈ హత్యలను ఎవరూ ఆపలేరని చెబుతూ తనని తాను కాల్చుకుని చనిపోతాడు. దీంతో పోలీస్‌శాఖ ఈ కేసును సీరియస్‌గా తీసుకుంటుంది. ఆత్రేయ చెప్పిన వాళ్ళెవరో కనిపెట్టి కాపాడాలని భావిస్తుంది. పనిలో నిజాయతీగా ఉండే పోలీస్ ఆఫీసర్ నంది (విష్ణు విశాల్)కి ఈ బాధ్యతలు అప్పగిస్తుంది. చనిపోయిన తర్వాత కూడా ఆత్రేయ వరుస హత్యలు ఎలా చేశాడు? వాటిని అడ్డుకునేందుకు నంది అతడి టీమ్ ఏం చేసింది? ఈ క్రమంలో వాళ్లకు ఎదురైన సవాళ్లు ఏంటి? కేవలం ఐదుగురినే హత్య చేయడంలో ఆంతర్యం ఏంటన్నది కథ. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తాయి మర్డర్ మిస్టరీ థ్రిల్లర్స్. హత్యలను ఛేదించడానికి లేదా సీరియల్ కిల్లర్ నుంచి వాటిని తప్పించడానికి కథానాయకుడు చేసే సాహసాలు, వేసే ఎత్తులు, పైఎత్తులు అన్నీ అలరిస్తాయి. 'ఆర్యన్' విషయంలో దర్శకుడు కొంతవరకూ సఫలం అయ్యారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా 'ఆర్యన్'ను ఆరంభించిన తీరు మెప్పిస్తుంది. అసలు చనిపోయిన వ్యక్తి మిగిలిన నలుగురిని ఎలా చంపుతాడా? అన్న ఆసక్తి సినిమా చూసే ప్రేక్షకుడిలో కలుగుతుంది. అదే సినిమా చూసేలా ప్రేక్షకుడిని సమాయత్తం చేస్తుంది.ఆత్రేయ సవాల్‌ను స్వీకరిస్తూ పోలీసులు నందిని రంగంలోకి దింపడం వెంటనే అతడు ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టడంతో కథ, కథనాలు మరింత ఆసక్తికరంగా నడుస్తాయి. ఆ తర్వాత హత్యకు గురయ్యే వ్యక్తుల వివరాలు వెల్లడించేందుకు ఆత్రేయ ఎంచుకున్న మార్గం, వాడుకున్న టెక్నాలజీ పోలీసులతో పాటు ప్రేక్షకుడినీ థ్రిల్‌కు గురిచేస్తుంది. ఈ పోలీసులు సాగించే ఇన్వెస్టిగేషన్ మాత్రం రొటీన్ ఫార్మాట్‌లో ఉంటుంది.



# రివాల్వార్ రీటాగా వచ్చిన కీర్తి సురేశ్




ఓ వైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ జోరు చూపించే ప్రయత్నం చేస్తోంది కీర్తి సురేశ్. ఇప్పుడామె నుంచి వచ్చిన యాక్షన్ సినిమా 'రివాల్వర్ రీటా'. పాండిచ్చేరిని అడ్డాగా చేసుకుని ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు డాన్ డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్). అతన్ని ఎలాగైనా హత్య చేసి తన సోదరుడి చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నర్సింహారెడ్డి (అజయ్ ఘోష్) ఓ ముఠాతో రూ.5 కోట్లకి ఒప్పందం కుదుర్చుకుంటాడు. దీనిలో భాగంగా పాండ్యన్‌ను హనీట్రాప్ చేసి చంపేందుకు ప్రణాళిక రచించగా.. అతను డ్రగ్స్ మత్తులో ఓ ఇంటికి వెళ్లబోయి పొరపాటున పక్క వీధిలో ఉన్న రీటా (కీర్తి సురేశ్) ఇంటికి వెళ్తాడు. అక్కడ అనుకోకుండా జరిగిన గొడవలో రీటా తల్లి (రాధికా శరత్ కుమార్) కొట్టిన దెబ్బకు పాండ్యన్ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తాడు. మరి ఆ తర్వాత ఏమైంది? డ్రాకులా పాండ్యన్ హత్య వల్ల రీటా కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? పాండ్యన్‌ను హత్య చేసి రూ.5కోట్లు కొట్టేయాలనుకున్న మార్టిన్ ముఠా వల్ల రీటాకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? తన తండ్రి జాడ వెతుక్కుంటూ వేట మొదలు పెట్టిన బాబీ పాండ్యన్ (సునీల్)కి రీటా కుటుంబం చేసిన పని గురించి తెలిసిందా? లేదా? అన్నది చిత్ర కథ. ఇది పగ, ప్రతీకారాలతో ముడిపడి ఉన్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్. కర్మ ఎవరినీ విడిచి పెట్టదు.. దాని ఫలితాన్ని అనుభవించక తప్పదనే కోణంలో సాగుతుంది. కథానాయిక కుటుంబంలో జరిగిన ఓ అన్యాయానికి కాలం కర్మ రూపంలో ఎలా బదులు తీర్చుకునే అవకాశమిచ్చిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. లైన్‌గా చూసినప్పుడు ఈ కథ ఆసక్తిరేకెత్తించేలాగే ఉన్నా.. దాన్ని తెరపై ఆవిష్కరించిన విధానం ఏమాత్రం మెప్పించదు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌లో ఇటు నవ్వులు.. అటు థ్రిల్ ఏదీ సరిగ్గా పండలేదు. కథా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ సినిమాను మొదలు పెట్టిన దర్శకుడు.. డ్రాకులా పాండ్యన్ ప్రాణాలు కోల్పోవడంతో కీలక మలుపు తిప్పాడు. ఇక అక్కడి నుంచి ఇంట్లో శవాన్ని మాయం చేసేందుకు ఇటు రీటా కుటుంబం పడే పాట్లు.. అటు ఆ శవాన్ని దక్కించుకునేందుకు మార్టిన్ గ్యాంగ్ చేసే ప్రయత్నాలతో కథ ముందుకు సాగుతుంది.రీటా పాత్రలో కీర్తి సురేశ్ తెరపై అందంగా కనిపించింది. నటిగా ఇది ఆమెకు సవాల్ విసిరే పాత్రేమీ కాదు. సినిమా మొత్తం దాదాపు ఒకే ఎక్స్‌ప్రెషన్‌లో కనిపిస్తుంది. ద్వితీయార్ధంలో తనలోని యాక్షన్ కోణాన్ని రుచి చూపించింది. తల్లి పాత్రలో రాధికా శరత్ కుమార్ నటన అక్కడక్కడా నవ్వులు పూయించింది. ప్రతినాయకుడిగా బాబీ పాండ్యన్ పాత్రలో సునీల్ ఆద్యంతం సీరియస్ లుక్‌లోనే కనిపించారు. తన ఆహార్యం కొత్తగా ఉంది. జాన్ విజయ్, సూపర్ సుబ్బరాయన్, అజయ్ ఘోష్ తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి.



# మంధాన తండ్రి కోలుకోగానే పలాశ్‌తో వివాహం

**పలాశ్ తల్లి అమిత ముచ్చల్ వెల్లడి**



టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన- పలాశ్ ముచ్చల్ పెళ్లిపై గందరగోళం నెలకొంది. ఈనెల 23న ఈ పెళ్లి జరగాల్సి ఉండగా, ఆ రోజు స్మృతి తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురవ్వడంతో వాయిదా పడింది. ఆ తర్వాత వరుడు పలాశ్ కూడా అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరడం, అతడు ఇంకో అమ్మాయితో క్లోజ్? ఎఫైర్స్ ఉన్నాయని? ఆరోపణలు ఎదుర్కోవడంతో అభిమానులు కన్?ఫ్యూజన్?కు గురయ్యారు. దీంతో వీళ్ల పెళ్లి గురించి ఆందోళన నెలకొంది. తాజాగా దీనిపై పలాశ్ తల్లి అమిత ముచ్చల్ స్పందించారు. స్మృతి- పలాశ్ పెళ్లి వ్యవహారంలో అనేక రూమర్స్ వస్తున్న వేళ వరుడి తల్లి అమిత ఈ సస్పెన్స్?కు తెరదించారు. అతి త్వరలోనే వాళ్ల పెళ్లి జరుగుతుందని క్లారిటీ ఇచ్చారు. స్మృతి తండ్రితో పలాశ్?కు మంచి అనుబంధం ఉందని అందుకే తాము పెళ్లి వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. ఆయన పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వచ్చిన తర్వాత పెళ్లి ఉంటుందని తెలిపారు. పెళ్లి వేడుకలకు కుటుంబ సభ్యులంతా మానసికంగా, శారీరకంగా రెడీగా ఉండాలని పలాశ్ కోరుకుంటున్నట్లు ఆమె వివరించారు. స్మృతి తండ్రి ఆరోగ్యం పట్ల తమ కుమారుడికి ఉన్న శ్రద్ధ గౌరవాన్ని ప్రదర్శిస్తుందని, తాను ఫ్యామిలీకి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాడో తెలుపుతుందని చెప్పారు.'మంధాన తండ్రి కోలుకోగానే స్మృతి- పలాశ్ వివాహం ఉంటుంది. ఆమెను తన భార్యగా ఇంటికి తీసుకొచ్చేందుకు పలాశ్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. మేం కూడా వాళ్లకు స్వాగతం పలికేందుకు ఉత్సాహంగా ఉన్నాం. ఆ స్పెషల్ డే కోసం వాళ్లిద్దరూ ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అంతా బాగానే ఉంది. త్వరలోనే ఇరుకుటుంబాలు, సన్నిహితుల సమక్షంలో స్మృతి- పలాశ్ పెళ్లి గ్రాండ్?గా జరుగుతుంది' అని అమిత పేర్కొన్నారు.మహారాష్ట్ర సాంగ్లీలో ఓ ఫామ్?హౌస్?లో స్మృతి- పలాశ్ పెళ్లి వేడుకలు, సంగీత్, హల్దీ, మెహందీ ఈవెంట్లు గతవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు మహిళా క్రికెటర్లు హాజరై సందడి చేశారు. కాబోయే భర్త పలాశ్?తో స్మృతి డ్యాన్స్ స్టెప్పులు వేసింది. ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆమె స్వయంగా తన ఇన్?స్టాగ్రామ్?లో పోస్ట్ చేసింది. అవి వైరల్ అయ్యాయి. అయితే తండ్రి అనారోగ్యం పాలవ్వడం, పెళ్లి పోస్ట్?పోన్ కావడంతో ఆమె ఈ వేడుకలు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించింది. చాటింగ్ స్క్రీన్?షాట్లు వైరల్ఆ తర్వాత స్మృతిని కించపరుస్తూ పలాశ్ ఇంకో అమ్మాయితో చాట్ చేస్తున్నట్లు ఆరోపిస్తున్న చాటింగ్ స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అతడు స్మృతిని చీట్ చేస్తున్నాడంటూ నెటిజన్లు కామెంట్ చేశారు. కానీ దీనిపై ఇరు కుటుంబాలు కూడా స్పందించలేదు.స్మృతి పెళ్లి వాయిదా పడడంతో ఆమె స్నేహితురాలు, క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని బ్రిస్బేన్ హీట్ జట్టు వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో స్మృతికి మద్దతుగా ఉండేందుకు ఆమె బిగ్?బాష్?లో ఆడడం లేదు.

## భారత్ , శ్రీలంక టీ20 సిరీస్ కు షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ



నవంబర్ 2న విశ్వవిజేతలుగా నిలిచిన భారత మహిళల క్రికెట్, ఇక వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్?కప్?పై కన్నేసింది. ఈ క్రమంలోనే భారత్ మహిళల జట్టు మళ్లీ ఎప్పుడు బరిలోకి దిగుతుంది. ఎవరితో ఏ సిరీస్?లో ఆడనుందో అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వచ్చే నెల భారత్ మహిళల జట్టు, శ్రీలంకతో టీ20 సిరీస్? ఆడనుంది. ఈ సిరీస్ కోసం శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు భారత్? పర్యటనకు రానుంది. ఈ టూర్?లో 5 మ్యాచ్?ల టీ20 సిరీస్ ఉండనుంది. ఈ సిరీస్?లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోనే టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. తాజాగా బీసీసీఐ ఈ సిరీస్ షెడ్యూల్?ను ప్రకటించింది. ఇందులో రెండు మ్యాచ్?లు తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్? విశాఖపట్టణం వేదికగా జరగనుండడం లోకల్ ఫ్యాన్స్?కు కిక్? ఇచ్చే విషయం. ఇక త్వరలోనే ఈ సిరీస్?కు సంబంధించిన జట్టును కూడా బీసీసీఐ ప్రకటించే ఛాన్స్ ఉంది.డిసెంబర్ 21న ఈ సిరీస్ ప్రారంభం కానుంది. తొలి రెండు మ్యాచ్?లు డిసెంబర్ 21, 23 తేదీలలో విశాఖపట్నంలో జరుగుతాయి. దీని తర్వాత డిసెంబర్ 26, 28, 30 తేదీలలో తిరువనంతపురంలో చివరి మూడు టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సిరీస్?తో మరోసారి అభిమానులకు టీమ్‌ఇండియా మహిళా క్రీడాకారుల ఆటను చూసే అవకాశం ఉంది.శ్రీలంకపై భారత్?కు మంచి రికార్డు ఉంది. ఇప్పటిదాకా ఇరుజట్ల మధ్య 26 మ్యాచ్‌లు జరగ్గా అందులో భారత్ 20 విజయాలతో సూపర్ ట్రాక్ రికార్డును కలిగి ఉంది. శ్రీలంక చివరిసారిగా భారత్?ను 2014లో ఓడించింది. ఇక రీసెంట్?గా వరల్డ్?కప్ నెగ్గిన జోష్?లో ఉన్న టీమ్‌ఇండియా, స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్?ను క్లీన్?స్వీప్ చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు.కాగా, ఈ సిరీస్? వచ్చే ఏడాది జరగనున్న మహిళల టీ20 వరల్డ్?కప్?నకు సన్నద్ధంగా ఉపయోగపడుతుంది. 2026 జూన్ 12న పొట్టి కప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ ఈవెంట్?కు ఇంగ్లాండ్ ఆతిథ్యం ఇవ్వనుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com